శుక్రవారం
11-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 51
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

యుద్ధానికి సిద్ధంగా ఉండాలి

ఉత్తర కొరియా సైన్యాధక్షుడు పాక్ సు -2ను దేశాధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ తొలగించారు. యుద్ధం వచ్చే అవకాశం ఉందని, ఇందుకు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చీఫ్ ఆఫ్ ది జనరల్ స్టాఫ్ పాక్ సు-2 స్థానంలో వైస్ మార్షల్ రీ యంగ్ గిల్‌ను నియమించినట్లు కేసీఎన్ఏ వార్తాసంస్థ వెల్లడించింది.

2 లో

ఈసీల నియామక కమిటీ...
సీజేఐ తొలగింపు

కేంద్రమంత్రికి అవకాశం కల్పిస్తూ రాజ్యసభలో బిల్లు

మోదీ, షా బరితెగింపు : విపక్షాలు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకాలను నియంత్రించేలా కేంద్రం కొత్త బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. నియామక ప్యానల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని తొలగించి కేబినెట్ మంత్రికి ప్యానల్‌లో స్థానం కల్పించేలా బిల్లు తెచ్చింది. ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకాలు, సర్వీసుల షరతులు, పదవీకాలం) బిల్లు, 2023 ప్రకారం నియామక ప్యానల్ నుంచి సీజేఐను తొలగించింది. ఎన్నికల సంఘంలో నియామకాలను త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి నియమించాలని బిల్లులో ప్రతిపాదించారు.ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్షనేత, ప్రధాని ఎంపిక చేసిన కేంద్రమంత్రి ఒకరు కమిటీలో సభ్యులు కాగా ప్రధాని నేతృత్వం వహిస్తారు. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఎన్నికల సంఘంలో నియామకాలను ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సీజేఐ సభ్యులుగా ఉన్న కమిటీనే చేపట్టాలని ఆదేశించింది. ఈ త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సుల మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి మాత్రమే నియమించాలని స్పష్టంచేసింది. ఈసీల నియామకాల కోసం కొత్త చట్టం తెచ్చేంత వరకు ఈ త్రిసభ్య కమిటీ అమల్లో ఉంటుందని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ నియామకాల కోసం బిల్లును రూపొందించిన కేంద్రం.. త్రిసభ్య కమిటీలో సీజేఐను తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఈ బిల్లుపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సంఘాన్ని నియంత్రించాలని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా

- మిగతా 2 లో

దూషణే మోదీ ఆయుధం

- విపక్షాలపై విమర్శలకే ప్రధాని పరిమితం
- 90 నిముషాలు గడిచినా వినిపించని 'మణిపూర్'
- ప్రతిపక్షాల తీవ్ర అసహనం - వాకౌట్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో అల్లర్లపై ప్రధాని మౌనం వీడాలన్న పట్టుదలతో పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ప్రధాని మోదీ సమాధానం కోసం వేచివున్న ప్రతిపక్షాలకు నిరాశే ఎదురైంది. మోదీ రాజకీయ ప్రసంగం చేయడం, మొదటి 90 నిమిషాల వరకు కనీసం మణిపూర్ పేరును ప్రస్తావించకపోవడం విపక్షాలకు కోపం తెప్పించింది. సభను, భారత్‌ను, మణిపూర్ ప్రజలను అవమానించిన తీరుకు నిరసనగా వారంతా వాకౌట్ చేశారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయినప్పటికీ మోదీ మౌనదీక్షను భగ్నం చేయగలిగామని ప్రతిపక్షాలు సంతృప్తి చెందాయిగానీ మణిపూర్‌కు న్యాయం జరగాలన్న ఉద్దేశం నెరవేరలేదని తెలిపాయి. మణిపూర్ అంశం మీద దేశాన్ని ఉద్దేశించి మాట్లాడాలని ప్రధానిని కోరితే ఆయన రాజకీయ ప్రసంగం మాత్రమే చేశారని పార్టీలు అసహనం వ్యక్తంచేశాయి. మాట్లాడటం మొదలు పెట్టిన 90 నిముషాల వరకు మణిపూర్ పేరు కూడా ఎత్తలేదని కేవలం కాంగ్రెస్‌ను తిట్టడం, ప్రతిపక్షాలను అవమానించడం, విమర్శించడానికే పరిమితమయ్యారని దుయ్యబట్టాయి. అవిశ్వాస తీర్మానంలో లేవనెత్తిన ఏ ఒక్క అంశానికి ప్రధాని నుంచి సమాధానం రాలేదని కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని పార్టీలు తీవ్ర అసహనాన్ని వ్యక్తంచేశాయి. 'రాజకీయ ప్రసంగం మాత్రమే చేశారు. ఇందులో కొత్తదనం ఏమీ లేదు. అవిశ్వాస తీర్మానాన్ని ఎందుకు ప్రవేశపెట్టామో దాని ఉద్దేశం నెరవేరలేదు' అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. మణిపూర్ ప్రజలకు న్యాయం జరగడం, మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోదీ మాట్లాడాలనే ఉద్దేశంతో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాం. చాలా కాలం తర్వాత ప్రధాని సభకు వచ్చారు. ఆయన మౌనదీక్షను భగ్నం చేయగలిగాం. కానీ మణిపూర్‌కు సంబంధించినంత వరకు మా ఉద్దేశం నెరవేరలేదు. తన బాధ్యతల నుంచి ప్రధాని తప్పించుకుంటున్నారు' అని అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన గౌరవ్‌గొగోయ్ అన్నారు. డీఎంకే నేత టీఆర్ బాలు మాట్లాడుతూ అనేకసార్లు జోక్యం చేసుకున్నాగానీ ప్రధాని స్పందించలేదు. మణిపూర్‌కు న్యాయంపై మాటైనా మాట్లాడలేదని చెప్పారు. కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం స్పందిస్తూ తన ప్రభుత్వం ఏం చేసిందో, చేయాలని అనుకుంటుందో ఊదరగొట్టారేగానీ మొదటి 90 నిమిషాల ప్రసంగంలో మణిపూర్ ప్రస్తావనే రాలేదన్నారు. మోదీ తీరుపై ఆగ్రహంతో సభ నుంచి వెళ్లిపోయామని విపక్ష నేతలు చెప్పారు.

కాగా, సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కాంగ్రెస్‌తో ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎందుకు ప్రవేశపెట్టారన్న స్పష్టత కూడా విపక్షానికి లోపించిందని విమర్శించారు. తొలుత 2018లో మళ్లీ ఇప్పుడు అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చారుగానీ దానిపై సంసిద్ధంగా ఉంటారన్న నమ్మకాన్ని వమ్ముచేశారని వ్యాఖ్యానించారు. దేశాభివృద్ధి, సమగ్ర కోసం చట్టసభలు జరగాలని, వ్యక్తులు కాదు దేశానికే తొలి ప్రాధాన్యత ఇస్తామని మోదీ అన్నారు. నేటి భారతం ఒత్తిళ్లకు తలొగ్గబోదని ఉద్ఘాటించారు. కాలం మారిందని చెప్పిన ఆయన దేశానికి నూతన ఆర్థిక వ్యవస్థలుగా ఈశాన్య రాష్ట్రాలు అవతరలిస్తున్నట్లు తెలిపారు. 'కీలక బిల్లులను సభలో ఆమోదించినా కానీ ఆ బిల్లులపై విపక్షాలకు ఆసక్తి లేదు. దేశ ప్రజలపై విపక్షాలు విశ్వాస ఘాతుకానికి ఒడిగట్టాయి. పేదల గురించి ఆలోచన లేదు.. అధికారంలోకి రావడమే వారి పరమావధి. అవిశ్వాసం పెట్టి అభాసుపాల య్యాయి. క్రికెట్ భాషలో చెప్పాలంటే వరుస నోబాల్స్ వేస్తున్నాయి. అధికారపక్షం ఫోర్లు, సిక్సులు కొడుతోంది. విపక్షాలు మాట్లాడిన ప్రతి మాట దేశమంతా శ్రద్ధగా వింటోంది. ఇప్పటివరకు మీరు (విపక్షాలు) నిరాశ, నిస్పృహల్లో ముంచడం తప్ప దేశానికి చేసిందేమీ లేదు. వారు తీసుకున్న గోతిలో వారే పడుతున్నారు. 1999లో శరద్ పవార్ నాయకత్వంలో, 2003లో సోనియా నేతృత్వంలో అవిశ్వాసం పెట్టారు. 2018లో మళ్లీ అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఏం

- మిగతా 2 లో

గవర్నరు కోటాలో ఎమ్మెల్సీలుగా రవి, పద్మశ్రీ

సీఈవో ముకేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : గవర్నరు కోటాలో ఖాళీగా ఉన్న ఇద్దరు శాసన మండలి సభ్యుల స్థానాలను భర్తీ చేస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ నామినేట్ చేసిన కర్రి పద్మశ్రీ, డాక్టర్ కుంభా రవిబాబులను శాసన మండలి సభ్యులుగా నియమిస్తూ జీవో 87 విడుదల చేశారు. గతంలో గవర్నరు కోటాలో శాసన మండలి సభ్యులుగా నియమితులైన చాదిపిరాళ్ల శివనాథ రెడ్డి, ఎస్.ఎం.డీ.ఫరూక్ పదవీకాలం గత నెల 20న ముగిసిన నేపథ్యంలో ఆ ఖాళీ స్థానాల్లో నూతనంగా వీరిద్దరి నియమిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

పేదలకు ఇళ్ల పట్టాల కోసం
సీపీఐ భూపోరు

- పదెకరాల్లో జెండాలు పాతిన పేదలు
- గుంతకల్లులో భారీ ర్యాలీ... తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా
- పట్టాలివ్వకపోతే ప్రభుత్వ భూములు ఆక్రమిస్తాం: జగదీశ్

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ భూపోరాటం చేపట్టింది. గుంతకల్లులో ప్రభుత్వ భూములు గుర్తించి... అక్కడ ఎర్రజెండాలు పాతారు. సీపీఐ నాయకత్వంలో గురువారం వేలాదిమంది పేదలు రోడ్డెక్కారు.

2 లో

రాజ్యాంగ విలువలకు మోదీ తూట్లు

- ప్రజాస్వామిక విలువలకు జగన్ పాతర
- సీపీఐ రాష్ట్రకార్యవర్గ సమావేశంలో రామకృష్ణ ధ్వజం

2 లో

సెప్టెంబర్ నుంచి
ఫోర్టిఫైడ్ బియ్యం

- వీటిని ప్లాస్టిక్ బియ్యంగా అపోహపడొద్దు
- త్వరలో రాగులు, జొన్నలు కూడా పంపిణీ
- వచ్చే సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సెప్టెంబర్ నుంచి ఫోర్టిఫైడ్ బియాన్ని అన్ని జిల్లాల్లో పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్ ల ద్వారా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఈ విషయం తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్

- మిగతా 2 లో

మెగా ట్రబుల్

- భోళా శంకర్ టికెట్ల ధరపై ఉత్కంఠ
- పెంపుదల కోసం నిర్మాత దరఖాస్తు
- తెరపైకి జగన్ సర్కారు నిబంధనలు
- పత్రాల సమర్పణలో జాప్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మెగాస్టార్ చిరంజీవి తాజా చిత్రం భోళా శంకర్ టికెట్ల ధరల పెంపుదలపై ఉత్కంఠ నెలకొంది. భోళా శంకర్ సినిమా టికెట్ల ధరల పెంపునకు అనుమతివ్వాలంటూ ఏపీ స్టేట్ ఫిలిమ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ)కి చిత్ర నిర్మాతలు ఈ నెల ఒకటో తేదీన దరఖాస్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఈక్వెడార్ అధ్యక్ష అభ్యర్థి ఫెర్నాండో హత్య

దేశంలో 60రోజుల ఎమర్జెన్సీ ప్రకటన

యథావిధిగా 20న అధ్యక్ష ఎన్నికలు

క్విటో: ఈక్వెడార్ అధ్యక్ష అభ్యర్థి ఫెర్నాండో విల్లావిసెన్సీయో హత్యకు గురయ్యారు. దక్షిణ అమెరికా దేశంలో హింస పేట్రేగిన వేళ సంస్థాగత నేరాలు పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజధానిలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఫెర్నాండోను దుండగులు కాల్చి చంపారు. ఆయన మరణించినట్లు నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్ హెడ్ దయానా అటామైట్ గురువారం ధ్రువీకరించారు.

ఫెర్నాండో హత్యతో దేశంలో 60 రోజుల పాటు అత్యవసర పరిస్థితిని దేశాధ్యక్షుడు గ్యులెర్మో లాసో ప్రకటించారు. అధ్యక్ష ఎన్నికలు యథావిధిగా ఈనెల 20న జరుగుతాయన్నారు. ఫెర్నాండో హంతకులను వదిలిపెట్టమని, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కాల్చివేతకు గురికాక ముందు ఫెర్నాండో మాట్లాడుతూ తనకు అనేక బెదిరింపులు వచ్చాయని, మెక్సికోలోని సినాలావో కార్టల్ నేతలు కూడా చంపేస్తామని హెచ్చరించారని చెప్పారు.

అధ్యక్ష బరిలో ఉన్న ఎనిమిది మంది అభ్యర్థుల్లో ఫెర్నాండో ఒకరు. బిల్డ్ ఈక్వెడార్ మూవ్‌మెంట్ తరపు అభ్యర్థి. 59ఏళ్ల ఫెర్నాండోకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. అనుమానితుడిని అధికారులు అదుపులోకి తీసుకోగా తీవ్ర గాయాలతో అతను చనిపోయినట్లు ఈక్వెడార్ అటార్నీ జనరల్ కార్యాలయం వెల్లడించింది. సామాజిక మాధ్యమాల్లో వైరలైన వీడియోలో ఫెర్నాండో తన భద్రతా సిబ్బందితో కలిసి కార్యక్రమం నుంచి నిష్క్రమించడం, తెల్లరంగు ట్రక్కు వద్దకు చేరుకున్నప్పుడు కాల్పులు జరగడం, జనం కేకలు వేస్తూ అటూ ఇటూ పరుగులు తీయడం వంటి దృశ్యాలు ఉన్నాయి. ప్రశాంతంగా ఉండే ఈక్వెడార్‌లో గతేడాది నుంచి హింస పేట్రేగింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారుల బెడద పెరిగింది.

ఈక్వెడార్ కమ్యూనిస్టు పార్టీ ఖండన

అధ్యక్ష అభ్యర్థి ఫెర్నాండో విల్లావిసెన్సీయో ఎన్నికల ప్రచారమప్పుడు హత్యకు గురికావడాన్ని ఈక్వెడార్ కమ్యూనిస్టు పార్టీ (పీసీఈ) తీవ్రంగా ఖండించింది. నిష్పాక్షిక విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. అభ్యర్థులందరికి, రాజకీయ, పౌర సమాజ నాయకులకు అవసరమైన భద్రతా తదితర హామీలను ప్రభుత్వం నుంచి ఈక్వెడార్ ప్రజలతో కలిసి తాము డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటనలో పీసీఈ ప్రధాన కార్యదర్శి విన్‌స్టన్ అలార్కాన్ ఎలిజాల్డే పేర్కొన్నారు. నేరాల అదుపునకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నేరాలకు వ్యతిరేకంగా ప్రగతిశీల, తిరుగుబాటు, ప్రజాస్వామిక దళాలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

యుద్ధానికి సిద్ధంగా ఉండాలి

- ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ పిలుపు
- సైన్యాధ్యక్షుడిగా పాక్ సు తొలగింపు- రీ యంగ్ నియామకం

సియోల్: ఉత్తర కొరియా సైన్యాధక్షుడు పాక్ సు -2ను దేశాధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ తొలగించారు. యుద్ధం వచ్చే అవకాశం ఉందని, ఇందుకు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చీఫ్ ఆఫ్ ది జనరల్ స్టాఫ్ పాక్ సు-2 స్థానంలో వైస్ మార్షల్ రీ యంగ్ గిల్‌ను నియమించినట్లు కేసీఎన్ఏ వార్తాసంస్థ వెల్లడించింది. సైనిక దళాలను యుద్ధానికి సిద్ధం కావడానికి అత్యాధునిక ఆయుధాలు, యుద్ధ సామాగ్రితో విన్యాశాలు నిర్వహించాలని కిమ్ పిలుపునిచ్చారని వార్తానివేదిక పేర్కొంది. కొరియన్ రిపబ్లిక్ 75వ వార్షికోత్సవం సందర్భంగా సెప్టెంబరు 9న ఉత్తర కొరియా మిలీషియా పరేడ్‌ను నిర్వహించనుంది. దీనికి ముందు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలు జరగనున్నాయి. వీటిని ఉత్తర కొరియా తమ భద్రతకు ముప్పుగా భావిస్తుండటంతో కొరియా ద్వీపకల్పంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. తాజాగా జరిపిన సెంట్రల్ మిలిటరీ కమిషన్ సమావేశంలో ఆయుధ ఉత్పత్తిని పెంచుకోవాలని, మరిన్ని సైనిక విశ్యాసాలు నిర్వహించాలని కిమ్ పిలుపునిచ్చినట్లు మీడియా పేర్కొంది. గత వారం మూడు రోజుల పాటు ఆయుధ కర్మాగారాలను సందర్శించిన కిమ్ మరిన్ని క్షిపణులు, మానవరహిత గగనతల వాహనాలు, ఇతర ఆయుధాల ఉత్పత్తికి పిలుపునిచ్చారు. కేసీఎన్ఏ విడుదల చేసిన మ్యాప్‌ల ఫోటోల్లో కిమ్.. దక్షిణ కొరియా రాజధాని సియోల్, దాని పరిసర ప్రాంతాలను చూపుతున్నట్లు ఉన్నాయి. రష్యాకు ఉత్తర కొరియా ఆయుధాలు అందించిందని, అందులో ఫిరంగులు, రాకెట్లు, క్షిపణులు ఉన్నాయని అమెరికా చేసిన ఆరోపణలను రష్యా, ఉత్తర కొరియా తోసిపుచ్చిన విషయం విదితమే.

పేదలకు ఇళ్ల పట్టాల కోసం

సీపీఐ భూపోరు

విశాలాంధ్ర-గుంతకల్లు: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఐ భూపోరాటం చేపట్టింది. గుంతకల్లులో ప్రభుత్వ భూములు గుర్తించి...అక్కడ ఎర్రజెండాలు పాతారు. సీపీఐ నాయకత్వంలో గురువారం వేలాదిమంది పేదలు రోడ్డెక్కారు. సీపీఐ నాయకులు పేదలకు అండగా నిలిచారు. ముందుగా గుంతకల్లులోని కొత్త బస్టాండ్ నుంచి భారీ ర్యాలీ జరిగింది. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణాలకు రూ. 5 లక్షల చొప్పున లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. పేదలు ఎర్రజెండాలు చేపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. సీపీఐ జిందాబాద్, పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని నినదించారు. పేదల ర్యాలీతో ఆ ప్రాంతమంతా ఎరుపుమయమైంది. కసాపురం రోడ్డులోని సర్వేనంబర్ 315, 318లలో ఉన్న పదెకరాల ప్రభుత్వ భూమిలో 5 వేలమంది పేదలు ఎర్ర జెండాలు పాతారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ స్థలం ఉంటే పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి అభ్యంతరం లేదని తహసీల్దార్ రాము హామీ ఇచ్చారు. ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ మాట్లాడుతూ పేదలకు ఇంటి పట్టాలిచ్చామని, జగనన్న కాలనీలు నిర్మిస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలో, తక్కువ డబ్బుతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదని చెప్పారు. ఇప్పటికీ పేదలు అద్దె ఇళ్లల్లో జీవిస్తూ కిరాయి చెల్లించలేకపోతున్నారని తెలిపారు. గుంతకల్లు పట్టణంలోనే సుమారు 20 వేల మందికి ఇంటి స్థలం లేదన్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఇచ్చిన స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, ఆ స్థలాలను వైసీపీ ప్రభుత్వం లాక్కుందని విమర్శించారు. నాడు ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడానికి అప్పటి ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. నాటి ప్రభుత్వాలు పేదలకు జిరాక్స్ పట్టాలు మాత్రమే ఇచ్చి...ఒరిజినల్ పట్టాలను గృహనిర్మాణశాఖకు పంపి ఇల్లు నిర్మిస్తామని చెప్పాయని, కానీ వాటిని పూర్తి చేయలేదని వివరించారు. ఆ రద్దు చేసిన స్థలాల లబ్ధిదారుల పేర్లను ప్రభుత్వ రికార్డుల నుంచి తొలగించలేదని, ఆ పట్టాలు లబ్ధిదారుల పేరుతో ఉండటంతో వైసీపీ ప్రభుత్వం వారికి పట్టాలు, ఇళ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. పేదలకు కనీసం 100 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను పేదలకు పట్టాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూములపై పేదలకు సర్వహక్కులు కల్పించాలన్నారు. ఆగస్టు 15లోగా స్థలాలు కేటాయించకపోతే...16వ తేదీ నుండి ప్రభుత్వ భూముల్లో పేదలే ఇళ్లు నిర్మించుకొని...కాపురాలు చేస్తారని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేశ్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు మల్లయ్య, రామాంజనమ్మ, మురళీకృష్ణ, వంశీకృష్ణ, నందు, నాగేంద్ర, దౌలా, బాబాఫక్రుద్దీన్, వెంకట్ నాయక్, వేణు, వినోద్, అఖిల్ సహా వేలాదిమంది పేదలు పాల్గొన్నారు.

ఓపీఎస్ మా హక్కు

- ప్రభుత్వ ఉద్యోగుల నినాదం
- ఢిల్లీలో భారీ ప్రదర్శన
- కిక్కిరిసిన రాంలీలా మైదానం
- ఎన్‌పీఎస్ రద్దునకు డిమాండ్

న్యూఢిల్లీ: పాత పింఛన్ విధానం (ఓపీఎస్) మా హక్కు కొత్త పింఛన్ విధానం (ఎన్‌పీఎస్) వద్దు అని ప్రభుత్వ ఉద్యోగులు నినాదమిచ్చారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించని పక్షంలో దేశవ్యాప్తంగా భారత్ బంద్‌కు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏ రూపంలో జరిగే ఆందోళనల్లో, నిరసనల్లో, ర్యాలీల్లో పాల్గొనవద్దని, అలా పాల్గొంటే క్రమశిక్షణ చర్యలు, జీతాల్లో కోతలు తప్పబోవని కేంద్రప్రభుత్వం హెచ్చరికలు చేసినాగానీ గురువారం ఢిల్లీ, రాం లీలా మైదానంలో పింఛన్ హక్కు మహార్యాలీ విజయవంతమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రైల్వే, పీఎస్‌యూ ఉద్యోగులు, టీచర్లు, రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓపీఎస్ మా హక్కు నినాదాలతో ఆ ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించిన వారే దేశాన్ని పాలిస్తారన్నారు. ఓపీఎస్ మా హక్కు, ఎన్‌పీఎస్ ఉపసంహరించుకోవాలి అన్న ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. హల్లా బోల్ టోపీలు ధరించి అనేకమంది ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వ హెచ్చరికలను ఉద్యోగులు బేఖాతరు చేసి పాత పింఛన్ పథకం పునరుద్ధరణ ఉమ్మడి ఫోరం, జాతీయ సంయుక్త కార్యాచరణ సమితి (ఎన్‌జేసీఏ) బ్యానర్ కింద రాంలీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని నిరసన గళాన్ని మరింత బిగ్గగా వినిపించారు. ఎన్‌జేసీఏ జాతీయ కన్వీనర్, ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా మాట్లాడుతూ 2004, జనవరి ఒకటో తేదీ తర్వాత విధుల్లో చేరిన వారిలో చాలా మంది కొత్త ఫించన్ పథకం (ఎన్‌పీఎస్)కు వ్యతిరేకమని చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన ఉద్యోగుల్లో ఉందన్నారు. పాత పింఛన్ విధానంతోనే తమకు భద్రత అన్నారు. అందుకోసమే పింఛన్ హక్కుల మహార్యాలీ అని చెప్పారు. దశలవారీగా పోరాటాలకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో కాగడా ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహిస్తామని, జిల్లా అధికారులు, గవర్నర్లు ,కేబినెట్ కార్యదర్శులు, ప్రధానికి కూడా వినతులను అందజేస్తామని చెప్పారు. ఉద్యోగ వ్యతిరేక విధానాలను అమలుచేస్తున్న ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని హెచ్చరించారు. తమ డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే భారత్ బంద్‌కు పిలుపునిస్తామని, తదుపరి తీవ్ర పరిణామాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వానికి స్పష్టంచేశారు.

సీజేఐ తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

అనుకుంటున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈసీని నచ్చినట్టు ఆడించాలని భావిస్తున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ మాణిక్‌రామ్ ఠాకూర్ విమర్శించారు. ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయమని, ఎన్నికల పారదర్శకతపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. కాంగ్రెస్, ఆప్‌తో పాటు ప్రతిపక్ష పార్టీల ఆందోళన నడుమ ఈ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టారు. సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఆదేశాలను నీరుగార్చేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని విపక్షాలు దుయ్యబట్టాయి. కాగా, వచ్చే ఏడాది ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణతో ఎన్నికల కమిషన్‌లో ఖాళీ ఏర్పడుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటనకు ముందు పాండే పదవీ విరమణ పొందుతారు. రెండు సందర్భాల్లో మార్చిలో సార్వత్రిక ఎన్నికలను ఈసీ ప్రకటించింది. 65ఏళ్లు రావడంతో పాండే వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న రిటైరవుతారు.

ఫోర్టిఫైడ్ బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఆమ్లం, బి12 ఉంటాయన్నారు. వీటి వల్ల రక్తహీనత నివారించబడుతుందని, ఫోలిక్ ఆమ్లం రక్తం ఏర్పడటానికి సహాయపడుతుందని, బి12 విటమిన్‌తో నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని వివరించారు. ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ ను సాధారణ బియ్యంలో 1:100 నిష్పత్తిలో కలపటం వల్ల పోషక బియ్యం తయారవుతుందన్నారు. ఈ బియ్యం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఫోర్టిఫైడ్ బియ్యంతో శరీరానికి పోషకాలతోపాటు ఎక్కువ విటమిన్స్ అందుతాయన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం నీళ్లలో కలిపినప్పుడు, నీటిపై తేలటంతో ప్లాస్టిక్ అని అవగాహన లేని కొందరు అపోహపడుతున్నారని మంత్రి అన్నారు. మరికొంత మంది కావాలని ప్రభుత్వం ప్లాస్టిక్ బియ్యం సరఫరా చేస్తోందని సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మహోన్నత ఆశయంతో రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యం చేకూర్చటానికి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్ గా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పంపిణీ చేస్తుండగా ఇకపై రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్ ద్వారా అందించనున్నట్లు చెప్పారు. దేశంలో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రాల్లో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ నెల నుంచి ఐసీడీఎస్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు 3కిలోల పోషక బియ్యం ప్యాకెట్లను ఇంటికే రేషన్ పథకం కింద పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన పెంచటానికి ప్రభుత్వం ఇప్పటికే పోస్టర్లు తయారు చేయటం జరిగిందని, అంతేకాకుండా ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు తో వీడియో కూడా రూపొందించి ప్రచారం నిర్వహించనున్నామని చెప్పారు. విస్తృత ప్రచారం వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు రేషన్ దుకాణాల్లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిపిన గోదుమపిండి కూడా అందించటానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకు సంబంధించి త్వరలో టెండర్లు కూడా పిలవనున్నట్లు తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యం ప్లాస్టిక్ బియ్యం అనే అనుమానాలు తీరాలంటే మెడికల్ షాపుల్లో దొరికే అయోడిన్ ను తెచ్చి ఫోర్టిఫైడ్ బియ్యంపై వేస్తే నీలం రంగులోకి మారతాయని వివరించారు. ప్లాస్టిక్ అయితే రంగు మారవన్నారు. అలాగే నీళ్లలో నానబెట్టినప్పుడు ఫోర్టిఫైడ్ బియ్యం త్వరగా మెత్తబడతాయని, ప్లాస్టిక్ మెత్తబడదన్నారు. ఈ విషయాన్ని పాత్రికేయుల సమావేశంలో ప్రయోగాత్మకంగా మంత్రి చేసి చూపించారు. ఫోర్టిఫైడ్ బియ్యంను పంజాబ్, హరియాణా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోనూ తయారు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రాయలసీమ జిల్లాల్లో రేషన్ పంపిణీలో బియ్యంతో పాటు రాగులు, జొన్నలు అందిస్తున్నామని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనున్నామని మంత్రి వెల్లడించారు. వచ్చే సీజన్ లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు మంత్రి చెప్పారు. సమావేశంలో పౌర సరఫరాల కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలకు మోదీ తూట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజ్యాంగ విలువలకు తూట్లుపొడుస్తూ...వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకునేలా దుర్మార్గ నిర్ణయాలను, దుష్టచట్టాలు తీసుకువచ్చేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని, రాష్ట్రంలో ప్రజాస్వామిక విలువలకు పాతరేస్తూ అప్రజాస్వామికంగా జగన్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం ఆవుల శేఖర్ అధ్యక్షతన విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో జరిగింది. సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొని జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలను వివరించారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలకు తూట్లుపొడుస్తున్నదని విమర్శించారు. ప్రజావ్యతిరేక చట్టాలు, అనాలోచిత నిర్ణయాలు చేస్తూ ప్రజాస్వామిక వ్యవస్థను అధోగతి పాల్జేస్తున్నదన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐ, ఆర్‌బీఐ, ఐటీ తదితర వ్యవస్థలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని వికృత పాలనకు తెగబడిందన్నారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ మౌలిక లక్షణాలను తుంగలో తొక్కుతున్నదన్నారు. ఢిల్లీ సర్వీసుల బిల్లును నయానా, భయానా ఆమోదింప చేసుకున్న మోదీ సర్కారు...నేడు మరో అడుగు ముందుకేసి కేంద్ర ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన నియామక ప్యానెల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ కొత్తచట్టం తీసుకొచ్చేందుకు సిద్ధమైందన్నారు. సీజేఐకి బదులుగా ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేబినెట్ మంత్రి ఉండేట్లుగా చట్టం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం, నమ్మకం పోయేలా మోదీ ప్రభుత్వం నిర్ణయాలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రం దివాలా దిశగా పయనిస్తున్నదని, ఏ రంగంలోనూ అభివృద్ధి జరగడం లేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరిస్థితి అయోమయంగా ఉందని, ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించలేని దుస్థితికి వైసీపీ ప్రభుత్వం దిగజారిందన్నారు. పోలీసులను ప్రయోగించి శాంతియుత ఉద్యమాలను అణచివేయడం, ప్రతిపక్ష పార్టీల నేతలను గృహ నిర్బంధాలకు, అక్రమ అరెస్టులకు గురిచేయడమే జగన్ సర్కార్ పనిగా పెట్టుకున్నదని దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వం చేసిన అనాలోచిత నిర్ణయాలపై కోర్టులు అనేకసార్లు మొట్టికాయలు వేసినప్పటికీ పట్టీపట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికలకు ముందు హామీల వర్షం కురిపించిన జగన్...గద్దెనెక్కాక మాటతప్పి, మడమ తిప్పారని విమర్శించారు. పన్నుభారం, విద్యుత్ చార్జీల భారం, నిత్యావసర వస్తువుల ధరల మోతతో ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ, జగన్ ప్రభుత్వాల నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దివాలాకోరు విధానాలను ఎండగడుతూ ఈ నెల 17 నుండి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ బస్సుయాత్ర చేపట్టనున్నామని, బస్సుయాత్ర జయప్రదానికి ప్రజానీకం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మెగా ట్రబుల్

(మొదటిపేజీ తరువాయి)

అందజేయాలని కార్పొరేషన్ నిర్మాతలను కోరింది. అయితే, ఈ వివరాలు అందజేయకపోవడంతో టికెట్ల ధరపై అయోమయం ఏర్పడింది. గతంలో చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య చిత్రానికి ఇదే తరహాలో టికెట్ల పెంపుదలకు ఏపీ ఎఫ్‌డీసీకి ఆ చిత్ర నిర్మాతలు దరఖాస్తు చేసి, వాటికి అవసరమైన పత్రాలు అందజేశారు. భోళా శంకర్ చిత్ర నిర్మాతలు మాత్రం ఇంకా 11 రకాల పత్రాలను గురువారం సాయంత్రం వరకు ఇవ్వలేదు. దీంతో చిరంజీవికి, ఆయన అభిమానులకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చినట్లయింది. తాజాగా వాల్తేరు వీరయ్య చిత్రం 200 రోజుల వేడుకల్లో జగన్ ప్రభుత్వంపై చిరంజీవి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. చిత్ర పరిశ్రమకు చెందిన హీరోల పారితోషికాలపై రాజ్యసభలో సినిమాటోగ్రఫీ బిల్లుపై చర్చించిన అంశాన్ని ఆయన తప్పుపట్టారు. వైసీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి ఆ బిల్లుపై సమగ్రంగా చర్చిస్తూ హీరోల పారితోషికాలను నియంత్రించాలన్నారు. దీనిని ఉద్దేశించే చిరంజీవి వ్యాఖ్యలు చేసినట్లు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అవగతమైంది. దీంతో రెండు రోజులపాటు చిరంజీవి వ్యాఖ్యల్ని వైసీపీ మంత్రులు, నేతలు తీవ్రంగా తప్పుపట్టారు. అనేకచోట్ల చిరంజీవి అభిమానులు సైతం వైసీపీ నేతలపై నిరసనకు దిగారు. ఎమ్మెల్యే కొడాలి నాని వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గుడివాడలో చిరంజీవి అభిమానులు ఆందోళన చేశారు. ప్రసార మాధ్యమాల ద్వారా చిరంజీవి అభిమానులు, వైసీపీ శ్రేణుల మధ్య మాటల యుద్ధం, పరస్పర దూషణలు నడిచాయి. ఈ వ్యవహారానికి తెరపడిందనే లోపు, చిరంజీవి తాజా చిత్రం భోళా శంకర్‌కు కష్టాలు వచ్చి పడ్డాయి. టికెట్ల ధరల పెంపుపై ఏపీ ఎఫ్‌డీసీ పత్రాలు అడగడం ద్వారా చిరంజీవిని, చిత్ర నిర్మాతలను ఇరుకున పెట్టిందనే విమర్శలు వస్తున్నాయి.

ఏపీ ఎఫ్‌డీసీ నిబంధనలతో ఉక్కిరిబిక్కిరి...

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ ఎఫ్‌డీసీలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి... చిత్ర పరిశ్రమకు సంబంధించి వివిధ కీలక నిర్ణయాలు, టికెట్ల ధరల అంశాల్ని పరిగణనలోకి తీసుకుంది. రూ.100 కోట్లు, ఆపైన నిర్మించే చిత్రాలను భారీ చిత్రాలుగా పరిగణిస్తోంది. వాటికి కొన్ని రోజులు టికెట్ల ధరలు పెంచుకునేందుకు షరతులతో వెసులుబాటు కల్పించింది. ఆ చిత్రం 20 శాతం ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్ జరపాలన్నది మరో నిబంధన. చిత్ర నిర్మాతల బ్యాంకు పత్రాలు, ఐటీ రిటర్న్‌లు, జీఎస్టీ తదితర పత్రాలు ఇవ్వాల్సి ఉంది. వాటిని ఇవ్వడంలో భోళా శంకర్ నిర్మాతలు ఆలోచనలో పడ్డారు. ఏపీ ఎఫ్‌డీసీ అడిగిన 11 రకాల పత్రాలను అందజేస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. చిరంజీవి ఆ తరహా వ్యాఖ్యలు చేయకపోతే...భోళా శంకర్‌కు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించేది కాదేమోననే ప్రచారముంది. ఎంపీ విజయసాయిరెడ్డి సైతం చిరంజీవిని విమర్శిస్తూ పరోక్షంగా కౌంటర్ ట్వీట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. చిత్ర రంగమేమీ ఆకాశం నుంచి ఊడి పడలేదని, చిత్ర హీరోలు అయినా, రాజకీయవేత్తలు అయినా ప్రజలు ఆదరిస్తేనే మనుగడ ఉంటుందని, చిత్ర పరిశ్రమలోని పేదలు, కార్మికుల సంక్షేమం బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వారి యోగక్షేమాలు పట్టించుకునే బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందని పేర్కొన్నారు. సినిమాటోగ్రాఫ్ బిల్లుపై పార్లమెంట్‌లో మాట్లాడితే కోట్లకు పడగెత్తిన కొందరు హీరోలు భుజాలు తడుముకుంటున్నారని, సినీ పైరసీని అరికట్టడం ఎంత అవసరమో, చిత్ర కార్మికుల సంక్షేమం, చిత్ర పరిశ్రమలో మహిళల భద్రత అంతే ముఖ్యమన్న మాటలకు ఉలుకెందుకని ట్విట్టర్ వేదికగా ఘాటుగా స్పందించారు. దీంతో చిరంజీవి వ్యాఖ్యలను జగన్ ప్రభుత్వం తీవ్రంగానే పరిగణిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఆదాయ పత్రాల్లో హీరోల పారితోషికాలు

చిత్ర నిర్మాతలు సమర్పించే తమ బడ్జెట్ వివరాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో ఆయా చిత్రాలకు అయిన ఖర్చులతోపాటు హీరోల పారితోషికం వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో హీరోల పారితోషికంపై వైసీపీ నేతలు గట్టిగా పట్టుబడుతున్నారు. జనసేన నేత పవన్ కల్యాణ్ పారితోషికంపై ఆదాయ ధ్రువీకరణ పత్రాల ద్వారా లెక్కలు తేల్చాలంటూ నిలదీస్తున్నారు. బ్రో చిత్రానికి మొత్తం రూ.60 కోట్ల ఖర్చయితే...అందులో పవన్ కల్యాణ్‌కే రూ.50 కోట్ల పారితోషికం ఇచ్చారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పవన్ తన పారితోషికంలో కేవలం కొంత ఆదాయ పన్నులకు అనుగుణంగా తీసుకుని, మిగిలిన ఎక్కువ మొత్తం నేరుగా తీసుకుంటారని, దాంతో ఆదాయ శాఖకు రావాల్సిన పన్నును ఉద్దేశపూర్వకంగా ఎగవేస్తున్నారని వైసీపీ విమర్శిస్తోంది. ఇదే సమయంలో రాజ్యసభలో సినీ ఆటోగ్రఫీపై చర్చ జరగడం, ఆ తర్వాత దానిపై చిరంజీవి వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. ఇప్పుడు భోళా శంకర్ చిత్ర నిర్మాతలు తమ ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వానికి సమర్పిస్తే... అందులో చిరంజీవికి ఇచ్చే రెమ్యునరేషన్ వెల్లడయ్యే అవకాశముంది.

అతి తక్కువగా చూపినా, ఎక్కువగా చూపినా అది నిర్మాతల మెడకు చుట్టుకునే ప్రమాదముంది. అందువల్ల భోళా శంకర్ చిత్ర నిర్మాతలు ధ్రువీకరణ పత్రాలను ఏపీ ఎఫ్‌డీసీ కార్యాలయానికి చిత్రం విడుదల సమయానికి ముందు సమర్పిస్తారా... లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆ పత్రాలు సమర్పించిన తర్వాతే భోళా శంకర్ టికెట్ల ధరల పంచాయితీ తేలే అవకాశం కనిపిస్తుంది.

దూషణే మోదీ ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

సాధించారు. అసలు మీ సమస్య ఏమిటి...' అని మోదీ వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో శాంతి నెలకొంటుందని సభకు హామీ ఇస్తున్నాని ప్రధాని అన్నారు. మణిపూర్‌పై సంపూర్ణ చర్చ జరగాలనే ఆలోచన విపక్షాలకు లేదన్నారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అందరం కలిసి ఒక నిర్ణయానికి రావాలనే ఆలోచన విపక్షాలకు లేదు. మణిపూర్ ప్రజలపై ప్రేమకన్నా.. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన వారికి ఎక్కువని విమర్శించారు. మణిపూర్‌లో విపత్కర పరిస్థితులు ఏర్పడ్డాయి.. ప్రజల మధ్య విశ్వాసం నశించింది. మహిళలకు ఘోర అవమానం జరిగింది.. అది మనందరికీ తలవంపే' అని మోదీ అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఇష్టానుసారం ప్రభుత్వాలను, సీఎంలను మార్చడం అనేక సమస్యలను దారితీస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ చేసిన కుటిర రాజకీయాలే ఈశాన్య రాష్ట్రాల్లో నిరంతర సమస్యలకు కారణమయ్యాయని విమర్శించారు.

ఒకసారి భారతమాత హత్య అంటారు.. మరోసారి రాజ్యాంగం హత్య అంటారు.. ఎలాంటి భాష ఇది? బుజ్జగింపు విధానాలతోనే దేశానికి ముప్పు. ఈ సభ, దేశం సంపూర్ణంగా మణిపూర్ ప్రజలకు అండగా నిలుస్తుంది' అని ప్రధాని చెప్పారు. కాంగ్రెస్ కష్టాలు చూసి జాలి వేస్తోందని, పనికిరాని వస్తువును ఎన్నిసార్లు ప్రవేశపెట్టినా ప్రజలు పట్టించుకోరంటూ రాహుల్‌నుద్దేశించి మోదీ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. రాజకుమారుడు కారు అద్దం దించి దేశ సమస్యలు ఇప్పుడిప్పుడే చూస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమిని అహంకారపూరిత సంకీర్ణమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయాలని ఈ సంకీర్ణం చూస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.

మహిళల ఉపాధికి తక్కువ వడ్డీ రుణాలు

సహకార పటిష్టతతోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

సమీక్షలో ముఖ్యమంత్రి జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుష్టిగా ఉండాలంటే రైతులు, మహిళల ఆర్థిక స్థితిగతులు బలంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఈ లక్ష్యసాధనలో ఆప్కాబ్, జిల్లాకేంద్ర సహకార బ్యాంకులు, పీఏసీఎస్‌లు, ఆర్బీకేలు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్యకలాపాలు, మహిళల స్వయం ఉపాధి కార్యక్రమాలకు తక్కువ వడ్డీకే రుణాలు అందించడం వలన అభివృద్ధి సాధ్యమవుతోందని తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పీఏసీఎస్‌లు, డీసీసీబీలు, డీసీఎంఎస్‌ల బలోపేతంపై సమీక్షించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను, రైతు భరోసా కేంద్రాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేశామని, ప్రతి పీఏసీఎస్ పరిధిలోకి 3 నుంచి 4 ఆర్బీకేలను తీసుకు వచ్చామన్నారు. క్రెడిట్, నాన్ క్రెడిట్ సేవలు పీఏసీఎలు ఆర్బీకేల ద్వారా అందిస్తున్నాయని, ఇలాంటి మార్పులు వచ్చిన నేపథ్యంలో డీసీఎంఎస్‌ల పనితీరుపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులు వాటి ధరలపై ఎప్పటికప్పుడు సీఎం యాప్ ద్వారా వివరాలు వస్తున్నాయి. ఎక్కడైనా కనీస గిట్టుబాటు ధర లభించకపోయినా, నిరాశాజనకంగా ఉన్నా సీఎం యాప్ ద్వారా వివరాలు తెలియగానే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ ప్రక్రియలో డీసీఎంఎస్‌లకు సముచిత పాత్ర కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, దీంతోపాటు ప్రైమరీ, సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవస్థలు డీసీఎంఎస్‌ల ద్వారా ఇంటిగ్రేడ్ కావాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశనం చేశారు. కమర్షియల్ బ్యాంకుల కన్నా.. తక్కువ వడ్డీలకే రైతులకు, మహిళలకు వడ్డీలు ఇవ్వాలని, బంగారంపై ఇచ్చే రుణాలు కూడా తక్కువగానే ఉండాలన్నారు. 2019తో పోలిస్తే 2023 నాటికి పీఏసీఎస్‌లో ఆర్థిక కార్యకలాపాలు 84.32 శాతం పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు.

రాష్ట్రంలో కనీసం 400 పీఏసీఎలు నష్టాలనుంచి బయటకు వచ్చాయని తెలిపారు. ఆప్కాబ్‌లో గతంలో చూడని పురోగతి కనిపిస్తోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి డాక్టర్ కె. ఎస్ జవహర్ రెడ్డి, వ్యవసాయం, సహకారశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ జి వీరపాండియన్, అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, కో-ఆపరేషన్ అండ్ రిజిస్ట్రార్, కో-ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ అహ్మద్ బాబు, ఆప్కాబ్ ఎండీ ఆర్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీలో ప్రమాదం

ఇద్దరు కార్మికుల మృతి: మరో ఇద్దరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-పరవాడ (అనకాపల్లి జిల్లా): సింహాద్రి ఎన్టీపీసీలో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ టీపి-19 వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తీవ్రగాయాలైన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గును తీసుకు వెళుతున్న కన్వేయర్ బెల్ట్ కేబుల్ తెగిపోవడంతో ట్రే నేల కూలింది. దీంతో 15 మీటర్ల ఎత్తునుంచి నిర్మాణ కార్మికులు కిందపడిపోయారు. పనిచేస్తున్న ఎఫ్ జి డి కన్స్ట్రక్షన్ కు చెందిన ఒక కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన మరో ముగ్గురు కార్మికులను నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరొకరు మృతి చెందారు. గాయాల పాలైన బెంగాల్ కు చెందిన నలుగురు కార్మికులలో ఇద్దరు మృతిచెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పాత కేబుల్ ట్రేను కొత్త కేబుల్ ట్రేకు మార్పు చేస్తుండగా కొత్త కేబుల్ ట్రే నేల కూలింది. అయితే కన్వేయర్ బెల్ట్ కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సింహాద్రి ఎన్టీపీసీలో 5 వందల మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్ల నుంచి రోజుకు 2వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు సదరన్ గ్రిడ్ కు కూడా ఇక్కడ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. కాగా ప్రమాదం జరిగిన వెంటనే సింహాద్రి అధికారులు హుటాహుటిన సంఘటన స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలివ్వాలి: ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అనకాపల్లి జిల్లా పరవాడ సింహాద్రి ఎన్టీపీఎస్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణంగా ఆయన పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అధికారులు హడావుడి చేయడం తప్ప, పరిశ్రమల తనిఖీలు నిబంధనలకనుగుణంగా క్రమం తప్పకుండా జరగడం లేదన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని వివిధ పరిశ్రమల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న ప్రమాదాలే ఇందుకు నిదర్శనమన్నారు. సింహాద్రి ఎన్టీపీఎస్‌లో జరిగిన ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓబులేసు డిమాండ్ చేశారు.

వక్ఫ్‌బోర్డు అభివృద్ధికి జిల్లా కమిటీలు చేయూతనివ్వాలి



విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు జిల్లాల కమిటీలు చేయూతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు (ఏపీఎస్‌డబ్ల్యూబీ) ప్రత్యేక అధికారిణి షేక్ షిరీన్ బేగం పిలుపునిచ్చారు. గురువారం విజయవాడ పాతబస్తీలోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు, అధికారుల సంయుక్త అవగాహన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు సీఈవో అబ్దుల్ ఖదీర్ అధ్యక్షత వహించారు. షేక్ షిరీన్ బేగం మాట్లాడుతూ, ప్రభుత్వం వక్ఫ్ బోర్డు విధి నిర్వహణలో సహకారం కోసం జిల్లాల వారిగా ఎడ్వైజరీ కమిటీల ఏర్పాటు చేసిందన్నారు. స్టేట్ వక్ఫ్ బోర్డు అయా జిల్లాల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని ప్రకటించిందన్నారు. వీరు తమ తమ జిల్లాలలో స్థానికంగా ఉన్న వక్ఫ్ అధికారులతో కలిసి వక్ఫ్ ఆస్తుల పరిశీలన, పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా అంశాలల్లో తగిన సలహాలు సూచనలు ఇస్తే పరిశీలిస్తామని షిరీన్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాల కోసం ప్రభుత్వానికి అభ్యర్థనను పంపుతామన్నారు. వక్ఫ్ అధికారులతో కలిసి పరస్పరం తగిన సమచారం, గౌరవం ఇస్తూ కమిటీలు పనిచేయాలని, వక్ఫ్ బోర్డు సర్వతోముఖాభివృద్ధికి సహకరం అందించాలని షిరీన్ బేగం కోరారు. జిల్లా అధ్యక్షులు కమిటీలో వున్న అందరిని కలుపుకుని కార్యక్రమ నిర్వహణ కార్యక్రమాలను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల వక్ఫ్ బోర్డు కమిటీ అధ్యక్షులు, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసను ఖండిద్దాం

వినుకొండ శాంతి ర్యాలీలో ముప్పాళ్ల

విశాలాంధ్ర-వినుకొండ: దేశంలో మైనారిటీలపై దాడులు, అమానుష హత్యలను తీవ్రంగా ఖండిస్తు న్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మణిపూర్ సంఘటనలకు నిరసనగా పల్నాడు జిల్లా వినుకొండలో గురువారం జరిగిన శాంతి ర్యాలీలో ముప్పాళ్ల పాల్గొన్నారు. రాజ్యాంగం ప్రకారం దేశంలో అన్ని మతాలు సమానమేనని, అయితే, ఇప్పుడు మన రాజ్యాంగానికే తూట్లు పొడుస్తున్నారని ముప్పాళ్ల విమర్శించారు. ఆర్ఎస్ఎస్ అజెండా ప్రకారం మతోన్మాద అజెండాను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నిసిగ్గుగా అమలు చేస్తున్నారని వ్యాఖ్యానిం చారు. కేంద్రంలో అధికార మార్పిడి అత్యవసరమని చెప్పారు. ఆ బాధ్యతను ప్రజలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మూడుమాసాలుగా మణిపూర్‌లో మైనారిటీ వర్గంపై మారణకాండ కొనసాగుతున్నా ప్రధాని మోదీ నోరుమెదపక పోవడం దారుణమని, ప్రధాని పదవికే ఆయన అనర్హుడని ముప్పాళ్ల అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి అధికారం చేపట్టడం కోసం మోదీ-షా ద్వయం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు.

పాస్టర్ రోషన్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశంలో క్రైస్తవ మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. చర్చిలు దహనం చేస్తున్నారని, అయినా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వాలను గద్దె దించడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. శాంతి ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులకు, ప్రజాసంఘాలకు వామపక్ష నాయకులకు అభినందనలు తెలుపారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్ మారణకాండపై నోరువిప్పాలని పార్లమెంటులో డిమాండ్ చేస్తున్నా ప్రధాని మోదీ మౌనం వీడటం లేదని విమర్శించారు. మోదీ మౌనం వెనుక అనేక కుట్రలు దాగి ఉన్నాయని, ఒక మతానికి చెందిన వారి గృహాలు ధ్వంసం చేసి...చర్చిలను తగులబెట్టి... అమాయకులను హత్య చేశారని ఆరోపించారు. ఈ దాడుల వెనుక ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేంద్ర సింగ్ హస్తం ఉన్నదన్నారు. దేశానికి జవాబుదారీగా ఉండాల్సిన ప్రధాని... మతచిచ్చు రేపుతూ ప్రజల మధ్య అగాధం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. బీఎస్పీ నాయకులు నేరెళ్ల సాల్మన్ రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలు పోరాడి... ప్రాణాల ర్పించారని గుర్తుచేశారు. మణిపూర్ మారణకాండకు బీజేపీ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ నాయకులు టి.ఆంజనేయులు, సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, మాజీ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా, ఉలవలపూడి రాము, సీపీఎం నాయకులు హనుమంత రెడ్డి, బొంకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు ఆర్కే నాయుడు, ఎంఐఎం నాయకులు షేక్ బాజీ, ముస్లిం పెద్దలు మస్తాన్‌వలి, ఆయాజ్, పాస్టర్లు డేవిడ్, బుచ్చిబాబు, యేసురాజు, ప్రభుదాసు, జాన్, పీటర్ పాల్ తదితరులు మాట్లాడారు. శాంతి ర్యాలీలో వేలాదిమంది క్రైస్తవులు, ముస్లింలు, లౌకికవాదులు పాల్గొన్నారు. పట్టణంలో శాంతి ర్యాలీ ఎన్ఎస్పీ కాలనీ నుంచి ప్రారంభమై ఎమ్మార్వో కార్యాలయం మీదుగా శివయ్య స్తూపం, ఆర్టీసీ బస్టాండ్, సురేశ్ మాల్ మీదుగా ఎన్ఎస్పీ కాలనీకి చేరింది.

ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు

కేంద్రం నిధులు దారిమళ్లిస్తున్న జగన్ ప్రభుత్వం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ధ్వజం

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో సర్పంచులను కేవలం ఉత్సవ విగ్రహాలగా జగన్ ప్రభుత్వం మార్చివేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట సర్పంచ్‌ల నిధులు దారిమళ్లింపుపై బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్రం నుంచి రాజ్యాంగ బద్ధంగా 14,15ఆర్థిక సంఘాలు ప్రతిపాదించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లిస్తుందన్నారు. రాష్ట్రంలోని 13,369 పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడం వలన సర్పంచులు అప్పులు చేసీ .. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నారన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు ఆ నిధులను విడుదల చేయలేదన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశలో నిధుల కేటాయింపులో 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిధులు వాటా కేటాయింపులు ఉండాలన్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం గత నాలుగేళ్ల కాలంలో తన వాటాను జమ చేయకుండా కేంద్రం ఇస్తున్న నిధులను మాత్రం దారి మళ్లించటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, ఈదర హరిబాబు, జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, దర్శి నియోజక వర్గం ఇన్‌చార్జ్ బొటుకు రమేష్, గిద్దలూరు ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, కందుకూరు ఇన్‌చార్జ్ పిల్లి మల్లికార్జున, జిల్లా కార్యదర్శి చీకటి వంశీదీప్, సర్పంచులు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై 12న నిరసన దీక్ష

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

విశాలాంధ్ర - కోడుమూరు: ఉపాధ్యాయులు, పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న కర్నూలు కలెక్టరేట్ ఎదుట చేయతలపెట్టిన 12 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న పిలుపునిచ్చారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నవీన్ పాటి ఆధ్వర్యంలో గురువారం కోడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన దీక్షకు సంబంధించి కరపత్రం విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై తిమ్మన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యా రంగం సంక్షోభంలో పడిందని ప్రభుత్వం అశాస్త్రీయ విధానాల వలన ప్రభుత్వ పాఠశాలల నుంచి నాలుగు లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ విద్యా విధానం, 3,4,5 తరగతుల విలీనంతో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక తరగతి గదులు వెలవెలబోతున్నాయన్నారు. పర్యవేక్షణ పేరుతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులను భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని, పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషనర్ మన్మోహన్ సింగ్ ఇంతవరకు చార్జి తీసుకోలేదన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా 50శాతం మధ్యంతర భృతితో పీఆర్సీని తక్షణమే ప్రకటించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండిం గ్‌లో 60 వేల మంది ఉపాధ్యాయుల రెండు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని, మున్సిపల్ సర్వీస్ రూల్స్ ఆమోదించి పదోన్నతులు, బదిలీలు నిర్వహిం చాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు తైమూర్ బాషా, ఫ్యాప్టో నాయకులు కే. తిరుమల్ రెడ్డి, ఎం.ఇస్మాయిల్, జే.రామ చంద్రుడు, కిషోర్ కుమార్ రెడ్డి, రవి, శ్రీనివాసులు, ఎస్. తిక్కన్న, మారెన్న, అలీఖాన్, మహిళా ఉపాధ్యాయులు రజనీకాంతమ్మ, గౌరమ్మ, ఉషా కిరణ్, విరూపాక్షమ్మ, సలోమి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయం నీటిని విడుదల చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు



విశాలాంధ్ర - నంద్యాల: రాయలసీమ సాగునీటి తాగునీటికై శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్, ఎస్ఆర్బీసీ, తెలుగుగంగ, హంద్రీ-నీవా అయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేసి రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్య దర్శి. ఎస్. బాబాఫక్రుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే.రామాం జనేయులు మాట్లాడుతూ రాయలసీమ ప్రయోజనాలు కాపాడుతామని రైతు శ్రేయస్సు ముఖ్యమని చెబుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖరీఫ్ సీజను వచ్చినా రైతులు సాగునీటి కోసం ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్న కేసీ కెనాల్, తెలుగంగ, ఎస్ఆర్బీసీకి నీటిని విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. నంద్యాలలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల తేదీని ప్రకటించకుండా.. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో 854 అడుగుల నీటిమట్టం చేరిన తర్వాత పోతిరెడ్డిపాడు హెడ్ ఎగ్యులేటర్‌కు నీటిని వదలాల్సి ఉందని, ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్లో 863 అడుగుల నీరు చేరినప్పటికీ నీరు విడుదల చేయకుండా విద్యుత్ ఉత్పత్తి కోసం నీరును ఆపడం తగదన్నారు. త్రాగునీరు, సాగు నీటికి ప్రాధాన్యతను ఇవ్వాలని చట్టంలో ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా కేసీ కెనాల్, ఎస్ఆర్బీసీ, తెలుగు గంగ, హంద్రీనీవా ఆయకట్టు కాల్వలకు వెంటనే నీటిని విడుదల చేసి రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

డీజిల్ బస్సుల కొనుగోలుకు టెండర్లు: ఏపీఎస్ఆర్టీసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) 2023-24 సంవత్సరానికిగాను 1500 డీజిల్ బస్సుల బాడీల కొనుగోలు చేయాలని నిర్ణయించింది. టెండర్ల పద్ధతి ద్వారా రెండు దశల్లో వాటిని కొనుగోలు చేయనుంది. మొదటి పద్ధతిలో బీఎస్-6 (ఓబీడీ)-2 ఛాసిస్‌ల కొనుగోలు, రెండో పద్ధతిలో ఏసీ, నాన్-ఏసీ స్లీపర్, సీటర్ బస్సులకు సరిపడా బస్సు బాడీలు నిర్మించేందుకు సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఛాసిస్, బాడీ విభాగం చీఫ్ మెకానికల్ ఇంజినీర్ గురువారం వెల్లడించారు. ఇందులో మొదటి దశ దాదాపు పూర్తి కావస్తుండగా, రెండోదశ ప్రారంభమైంది. టెండర్లు, రివర్స్ బిడ్డింగ్‌ల ద్వారా వాటిని నిర్వహిస్తారు. గుర్తింపు పొందిన బస్సు తయారీదారులు ఈ టెండర్లలో పాల్గొనేందుకు అర్హులు. టెండర్ల పత్రాలను పరిశీలన కోసం న్యాయమూర్తి బి.శివశంకరరావుకు పంపారు. ఆయా టెండర్లను న్యాయ సమీక్ష వారి వెబ్‌సైట్‌లోను, ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లలో సాధారణ ప్రజలు, ఆసక్తిగల బస్సు బాడీ తయారీదారుల సలహాలు, సూచనల ఆహ్వానం మేరకు అందుబాటులో ఉంచుతారు.

అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అంగన్‌వాడీ కార్మికులు, సహాయకుల పని భారాన్ని తగ్గించాలని, వారి వేతనాలు పెంచాలని, సముచిత వసతులు కల్పించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరోజిని, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. నాయకులు గురువారం అమరావతిలోని శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, కమిషనర్ విజయ సునీతను కలిశారు. ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, సంబంధించిన బిల్లులు ఏ నెలకు ఆ నెల చెల్లించేలా చూడాలని కోరారు. ఈ నెలలో ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో పనిచేయటం చాలా ఇబ్బందిగా ఉందని వారి దృష్టికి తీసుకెళ్లారు. నిత్యం వెర్షన్ మారతుండటం సమస్యగా మారిందని తెలిపారు. గౌరవ వేతనమిస్తూ వేర్వేరు పనులన్నీ చేయించడం సమంజసం కాదన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించాలని, రూ.26వేల జీతంతో పాటు బీమా, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, పింఛన్ వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో సోదర సంఘాలను కలుపుకొని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈనెల 27న ఐఎఫ్‌టీయూ అంగన్‌వాడీ సంఘం, ఏఐటీయూసీ అంగన్‌వాడీ సమాఖ్యల సంయుక్త సదస్సు విజయవాడలోని సిద్ధార్థ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. అధికారులకూ ఆహ్వానం అందజేశారు. తమ డిమాండ్ల పరిష్కారానికి కృషిచేస్తామని అధికారులు హామీనిచ్చారన్నారు.

దోపిడీయే జగన్ లక్ష్యం

- ప్రజా సంక్షేమం పట్టదు
- విశాఖలో భూకబ్జాలను బయట పెడతా
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: వైసీపీ సర్కార్‌పై మరోసారి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిప్పులు చెరిగారు. వారాహి యాత్ర మూడో విడతలో భాగంగా గురువారం విశాఖ జగదాంబ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో జనసేనాని మాట్లాడారు. "వైసీపీని ఆంధ్రా నుంచి తన్ని తరిమేయాలి... అది విశాఖ నుంచే కావాలి. రాష్ట్రాన్ని నాశనం చేయడానికి ఒక్కడు చాలు. సీఎం జగన్‌కి, వైసీపీ గూండాలకు భయపడొద్దు. జగన్‌కి మేం బానిసలం కాదు... మేము నీకెందుకు భయపడతాం. నేను ప్రాణాలకు తెగించి రాజకీయాల్లోకి వచ్చా. పొట్టి శ్రీరాములను గుర్తు పెట్టుకోవడం లేదు... రాష్ట్రమంతా దోచుకున్న వారి విగ్రహాలు ఉన్నాయి. సీఎం కావాలని నేను అనుకుంటే సరిపోదు... మీరు అనుకోవాలి" అంటూ ఉద్వేగంగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్ ఒక వ్యాపారని, ఆయన రాజకీయ నాయకుడు కాదని, 38 కేసులు ఉన్న క్రిమినల్ వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రం ఇలాగే ఉంటుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. జగన్ ఒక గజదొంగ ని, దొంగను చూసి మనం పారిపోకూడదని, జగన్ పారిపోయేలా చేయండని కోరారు. పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టు కు చేరుకొని అక్కడ నుంచి పోలీసుల ఆంక్షలు మేరకు షీలానగర్ మీదుగా దస్ పల్లా హోటల్ కు చేరుకున్నారు. సభ రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు సాగింది. పవన్ మాట్లాడుతూ తెలంగాణలో వైయస్సార్ ముఠా దోపిడీ వల్లే విభజన జరిగిందన్నారు. రాష్ట్రంలో 30 వేల మంది అమ్మాయిలు కనబడకుండా అదృశ్యమయ్యారని, రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ గంజాయికి అడ్డాగా మారిందన్నారు. పొద్దున్నే పథకం కింద డబ్బులు వేసి సాయంత్రం సారాద్వారా కొట్టేస్తున్న జగన్‌ను నమ్మొద్దన్నారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న విశాఖను గుండాలకు అడ్డాగా, కిడ్నాపులు, హత్యలకు కేంద్రంగా మారిపోయిందని ఆరోపించారు. దోపిడీదారుల భూకబ్జాలతో విశాఖ విలవిలలాడుతోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సర్వం నాశనం చేయడానికి ఒక్కడు చాలని ఆ ఒక్కడే జగనన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న వైయస్సార్ కు విగ్రహాలు పెడుతున్నారని, రాష్ట్రాన్ని బలిదానంగా ఏర్పాటుచేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాలు కనబడటం లేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజలకు బానిసలని గుర్తుపెట్టుకోవాలన్నారు. వైసీపీని ఆంధ్రాలో తన్నీ తరిమేసే వరకు జనసేన పోరాటం ఆపదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, వైసీపీ ఎమ్మెల్సీ ఒక దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేశారని ఆరోపించారు. విశాఖ ఎంపీ కుటుంబాన్నే రౌడీషీటర్ కిడ్నాప్ చేస్తే ఇక సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఆంధ్ర యూనివర్సిటీని వైసీపీ కార్యాలయం గా మార్చేశారని వైస్‌ఛాన్సలర్ విద్యార్థుల కోసం కాకుండా వైసీపీ కోసం పనిచేస్తున్నారని పవన్ మండిపడ్డారు. విశాఖలో కొండలన్నిటినీ దోచేశారని, సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విశాఖలో భూకబ్జాలన్నీ బయటపెట్టి వైసీపీ భూకబ్జాదారులను విశాఖ వీధుల్లో నిలబెడతానని హెచ్చరించారు.

సీపీఐ బస్సు యాత్రకు తిరుపతి మున్సిపల్ వర్కర్స్ యూనియన్

రూ.50 వేల విరాళం

విశాలాంధ్ర - తిరుపతి: రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి... అని సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్న బస్సు యాత్ర విజయవంతానికి తిరుపతి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణకు రూ. 50 వేల విరాళం అందజేసింది. యూనియన్ నూతన భవనాన్ని సందర్శించిన రామకృష్ణను యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు తుల సేంద్ర, దొరస్వామి శాలవతో సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన భవనం నిర్మించుకోవడం అభినందనీయమని, యూనియన్ నాయకులు కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ నిర్వహించే బస్సు యాత్రకి యూనియన్ సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇందుకు యూనియన్ నాయకులు స్పందిస్తూ 50వేల రూపాయలు సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు కేవై రాజా, ఎన్‌డీ రవి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాములుకు యూనియన్ నాయకులు పి.దొరస్వామి, మదన్ మోహన్ వంశీ, సతీష్ ,సుబ్రహ్మణ్యం, గురప్ప, హిందుమతి తదితరులు అందజేశారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No.: 34/2023-24/SE(W-II)/EE-IV/DB/ Dt: 09.08.2023
Number of works : 04, Value of works : Rs. 462.72 Lakhs
Tender Opening Dt : 10.08.2023, Closing Date : 16.08.2023
Note : Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE-IV Cell No.: 8187897572. For Commissioner

సంపాదకీయం

తప్పించుకు తిరుగువాడు

మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న విధ్వంసం, మారణకాండ, క్రైస్తవుల మీద దాడి గురించి ప్రధానమంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు ఎంతగా పట్టుబట్టినా ఆయన నోటి నుంచి ముత్యాలు రాలలేదు. ఆయన పార్లమెంటులో అడుగే పెట్టలేదు. వరసగా ఇదే అంశం మీద పార్లమెంటులో ఎంత రభస జరిగినా ప్రధానమంత్రి నోరు మెదపడానికి సిద్ధం కాకపోవడంతో ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. అవిశ్వాస తీర్మానంమీద జరిగిన సుదీర్ఘ చర్చకు సమాధానం ఇచ్చిన మోదీ తన ప్రసంగంలో మణిపూర్ మారణకాండ మీద పెద్దగా చెప్పిందేమీలేదు. ఆ సమస్యకు బాధ్యత కూడా ప్రతిపక్షాలమీద తోసేసి షరా మామూలుగా తప్పించుకున్నారు. ఈశాన్య రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎప్పుడెప్పుడు ఏయే పొరపాట్లు చేసిందో ఏకరవు పెట్టడానికే ఎక్కువ సమయం కేటాయించారు. ప్రతిపక్షాల విమర్శలకు, లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానంచెప్పే సమయంలో ఆయన అసలు అంశాలను ప్రస్తావించకుండా తన వాక్ప్రవాహ నైపుణ్యం మీదే అధికంగా ఆధారపడ్డారు. అవిశ్వాస తీర్మానంమీద మాట్లాడే అవకాశం కాంగ్రెస్ పక్షనాయకుడు అధీర్ రంజన్ సర్కార్‌కు ఇవ్వనందుకు మోదీ కడివెడు కన్నీళ్లు కార్చారు. కానీ సభలో సవ్యంగా ప్రవర్తించలేదని ఆరోపిస్తూ అధికార పక్షానికి ఉన్న విపరీతమైన మెజారిటీని ఆధారంగా చేసుకుని అధీర్ రంజన్‌ను సభ నుంచి సస్పెండ్ చేశారు. తమ ప్రభుత్వం సాధించిన "విజయాల"ను ప్రపంచమంతా కీర్తిస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం తన ప్రభుత్వ ఘనతను గుర్తించడంలేదని నొచ్చుకున్నారు. మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమై గురువారానికి సరిగ్గా వంద రోజులైంది. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి చేత ప్రతిపక్షాలు ప్రకటన చేయించలేక పోయాయి. అయినా అవిశ్వాస తీర్మానానికి మోదీ సమాధానం చెప్పక తప్పలేదు. మోదీ ప్రసంగిస్తున్నంతసేపూ సభలో అధికారపక్ష సభ్యులు "మోదీ, మోదీ" అన్న నినాదాలు చేస్తూనే ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ఎప్పుడూ బీజేపీకి శుభప్రదంగానే ఉపయోగపడిందని మోదీ తనవీపు తానే చరుచుకున్నారు. మోదీ సమాధానం మొత్తం ఎన్నికల ప్రచార సభలో ప్రసంగంగానే కొనసాగింది. ఆ ప్రసంగం నిండా సారం తక్కువ, ఆర్భాటం ఎక్కువ అని అవిశ్వాసతీర్మానం ప్రతిపాదించిన ప్రతిపక్ష ఫ్రంట్ "ఇండియా" కు చెందిన సభ్యులు పోస్టర్లు ప్రదర్శించారు. కానీ ఈ సంఘటనను చూపించకుండా సన్సద్ టీవీ ముఖం తిప్పేసుకుంది. అప్పుడే ప్రతిపక్షాలు "మణిపూర్, మణిపూర్" అని నినదించవలసి వచ్చింది. సభ్యత్వం పునరుద్ధరించిన తరవాత రాహుల్ లోకసభలో అవిశ్వాస తీర్మానంపై మాట్లాడినప్పుడు కేవలం మోదీ ప్రభుత్వాన్ని తూలనాడడానికే పరిమితం కాలేదు. రాహులే కాదు ఏ ప్రతిపక్ష నాయకుడి ప్రసంగమూ 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రసంగాలుగా కనిపించలేదు. బుధవారం అవిశ్వాస తీర్మానంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా 125 నిమిషాలు మాట్లాడి సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రధాన మంత్రి మోదీ ఆ రికార్డును విజయవంతంగా బద్దలుకొట్టి 133 నిమిషాలు మాట్లాడారు. అసలు విషయాన్ని ప్రస్తావించకుండా తమ స్వోత్కర్షకు అమిత్ షా, మోదీ సకల జాగ్రత్తలూ తీసుకున్నారు. రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులు లేవనెత్తిన అంశాలకు సూటిగా సమాధానంచెప్పే శక్తి కోల్పోయిన అధికార పక్షం ఊకదంపుడు ఉపన్యాసాలను, రికార్డులు సృష్టించే క్షుద్ర ప్రక్రియను ఆశ్రయించవలసి వచ్చింది. బుధవారం అమిత్ షా ప్రసంగం పునరుక్తులతోనే సరిపోయింది. మోదీ మాత్రం తన తొమ్మిదేళ్ల పాలనను సమర్థించుకునే క్రమాన్ని, జాతీయవాదాన్ని సంకుచిత రాజకీయాలకు, హిందుత్వవాదులు చెప్పే జాతీయతావాదాన్ని విడమర్చడానికి వినియోగించుకున్నారు. బీజేపీ అనుసరించేది నిఖార్సయిన జాతీయతావాదం అని నిరూపించడానికి మోదీ నానా ప్రయాస పడవలసి వచ్చింది. భారతీయ జాతీయవాదం గురించి చెప్పడానికే మోదీ ప్రసంగం అంకితమైంది. మణిపూర్‌లో భారతమాతను హత్య చేశారు అన్న ఆరోపణలకు జవాబివ్వలేని అధికారపక్షం ప్రతిపక్షాలపై దాడితో సరిపెట్టుకోక తప్పలేదు. ప్రతిపక్షాలు ఇంత తీవ్రమైన విమర్శలు గుప్పిస్తాయని అమిత్ షా కూడా ఊహించినట్టు లేదు. పాత సంఘటనలను పునరావృతం చేయడంతోనే ఆయన సంతృప్తి పడవలసి వచ్చింది.

అయితే ప్రధానమంత్రి అసలు విషయాలు ప్రస్తావించకుండా తన ప్రసంగమంతటినీ ఆత్మస్తుతి, పరనిందకు పరిమితం చేసినప్పుడు ప్రతిపక్షాలు సభనుంచి వాకౌట్ చేశాయి. దాదాపు ప్రతిపక్ష స్థానాలన్నీ ఖాళీగా ఉండిపోయాయి. ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించినప్పుడల్లా తన ప్రభుత్వం మరింత ఎక్కువ మెజారిటీతో గెలుస్తుందని మోదీ తారీకులు, దస్తావేజులతో సహా వివరించారు. ఈ ఒక్క అంశమే ఆయనది అవిశ్వాస తీర్మానానికి సమాధానం కాదు ఎన్నికల ప్రచార ప్రసంగం అని రుజువు చేస్తోంది. 2019 ఎన్నికలకు ముందు 2018లో ప్రతిపాదించిన, ఇప్పుడు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాలు ప్రతిపక్షాల బలం ఎంత బలహీనమైందో నిరూపించడానికే ఉపయోగపడ్డాయని చెప్పడంతో మోదీ మెదడు ఎన్నికల మూసలోంచి బయటకురాదని తేలిపోయింది. మోదీ మొత్తం 133 నిమిషాలు ప్రసంగిస్తే మొదటి 90 నిముషాలలో మణిపూర్ మారణకాండ ప్రస్తావనే రాలేదు. అంటే ప్రధానమైన ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా వాగ్దాటితో సమస్యను దాటవేసే కళలో అద్వితీయుడినని మరోసారి నిరూపించుకున్నారు. ఈ కారణంగానే ప్రతిపక్షాలు వాకౌట్ చేయవలసి వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నాయకత్వంలోని బి.ఆర్.ఎస్., శిరోమణి అకాలీదళ్ సభ్యులు సైతం ప్రతిపక్షాలతో పాటు వాకౌట్ చేశారు. అంటే మోదీ ప్రభుత్వం మీద ఎంత వ్యతిరేకత గూడుకట్టుకుందో అంచనా వేయవచ్చు. చివరలో మాత్రం మణిపూర్ ఇక ముందు అభివృద్ధి పథంలో కొనసాగుతుందని మోదీ ఊరడింపు పలుకులు పలికారు. హింసాకాండలో బీజేపీ పన్నాగంపై సహజంగానే ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అక్కడ శాంతి నెలకొనేట్టు చేస్తామని ప్రధాని ఇచ్చిన హామీలో డొల్లతనం మాత్రమే కనిపిస్తోంది. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడం ద్వారా ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ప్రతిపక్షాలపై తిట్లు లంకించుకోవడంతో ఆయన వైఖరి ఏమిటో స్పష్టం అయింది. అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని ఎవరూ భ్రమ పడలేదు. కానీ మణిపూర్ ప్రజలకు న్యాయం కలగాలన్న ప్రతిపక్షాల అభిప్రాయాన్ని ఈ తీర్మానం రూపంలో మరోసారి గొంతెత్తి చెప్పడానికి వీలైంది. మణిపూర్ అంశంపై మోదీ నిర్దిష్టంగా మాట్లాడాలన్న లక్ష్యం మాత్రం నెరవేరలేదు. సూక్ష్మంగా మోదీ మణిపూర్ అంశాన్ని ప్రస్తావించినా అందులోనూ ప్రతిపక్షాలను దూషించడంతోనే సరిపుచ్చుకున్నారు. మణిపూర్ గురించి ప్రస్తావించాలని ప్రతిపక్షాలవారు ఎన్నిసార్లు అడిగినా మోదీ తన ధోరణిలోనే కొట్టుకుపోయారు. ప్రతిపక్షాల లక్ష్యం సంపూర్ణంగా నెరవేరక పోయినా చాలా కాలం తరవాత మోదీ నోరు తెరిపించడం సాధ్యమైంది. ఫక్తు పలాయనవాది నుంచి ఇంతకన్నా ఏం ఆశించగలం! మోదీ మణిపూర్ ప్రజలనే కాక దేశవాసులందరినీ అవమానించినందుకే ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

మోదీజీ ఇక చాలు

మోదీజీ ఇక చాలు యిక భరించలేమయ్యా ఇక చాలు ఇక చాలు. ఏమిటి బావ ఇక చాలు అంటున్నావు. మోదీ పాలనలో అన్ని సమకూరి స్వర్గసీమలా మోదీ కలలుగన్న రామరాజ్యం సిద్ధించింది. ప్రతి మనిషికి 15లక్షలు యిచ్చాడు అంబేద్కరు కోరుకున్న సమ సమాజం, రూలుతో కోరుకున్న ఆర్థిక సమానత్వం అన్ని సిద్ధింపచేసేడు. అందుకే ఇక చాలంటున్నాను. నిజమే గుజరాత్‌లో ముస్లింల ఊచకోత, మణిపూర్‌లో నగ్న ఊరేగింపులు, హరియాణాలో మతకల్లోలాలు వీటన్నిటిమీద ప్రశ్నించే హక్కు అన్నీ ఇచ్చాడు. కాని ప్రశ్నకు జవాబు మాత్రం చెప్పడు. ఆ మూడింటితో ఆపావేంటయ్యా అయోధ్యలో మసీదుకూల్చి రామాలయం నిర్మిస్తున్నారు. అది ప్రారంభమైతే ఆయన ఇంట్లో కూర్చున్నా ఆ శ్రీరాముడే గీత రామరాజ్యంలో ఉన్న మంచిపాలన చేయిస్తాడు. అందుకేనా ఒక రాముడి వల్ల కాదేమోనని మరో రామాలయ నిర్మాణం అవసరాన్ని గుర్తించి కాశి సమీపంలోని మరో మసీదుపై సర్వే కోసం కోర్టు కెక్కారు. అక్కడ కూడా మశీదు అడుగున రామాలయం కన్పిస్తుంది. దాంతో రామాలయం కూల్చి మశీదు కట్టారు. కనుక మశీదు కూల్చి రామాలయం కడతామంటారు. ఆనవాళ్లకోసం వంద అడుగులు తవ్వినా అయోధ్య మశీదు అడుగున రామాలయం ఆనవాళ్లు కనపడలేదు. ఖంగారు పడకయ్యా ఇపుడు సర్వే రిపోర్టువచ్చాక మశీదు పడగొట్టిదాని అడుగున తప్పక రామాలయ



ఆనవాళ్లు చూపుతారు.

అయినా బావ నాకు తెలియక అడుగుతాను ఉన్న మశీదును కూల్చి కట్టకపోతే రామాలయం నిర్మాణానికి స్థలం దొరకదా అని. అదంతా గతంలో నీలాగ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు వేరేచోట ఎంత స్థలం కావాలన్నా తీసుకోండి అయోధ్యలో మశీదు కూల్చి అక్కడే కట్టాలా అని అడిగారు. కాని గతంలో ముస్లింల పాలనలో రామాలయాలు పడగొట్టి ముస్లిం రాజులు మశీదులు నిర్మించారు కాబట్టి మేము ఇపుడు వాటిని పడగొట్టి రామాలయం కడితే తప్పేంటి అన్నారు. అదేంటి వాళ్లు తప్పుచేస్తే వీళ్లు తప్పుచేస్తే వీరు పవిత్రులెలా అవుతారు. మంచి కాదు ప్రతీకారం అంతే. అది సరే మూడు, నాల్గు రోజుల నుండి పార్లమెంటులో ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టినా మోదీ నోరు విప్పడేంటి. వాయిదాలువేసి సభా సమయం వృధాచేసి, ప్రజలసొమ్ము నాశనం చేస్తున్నారుగ. మౌనమె నా భాష ఓ మూగ మనసా" అని గతంలో ఒక పాట. బాల మురళీకృష్ణ చాలా బాగా పాడారు బావ. బహుశా అది గుర్తుకొచ్చి మోదీ మౌనం వహించారనుకుంట. అయితే మౌనం అర్ధ అంగీకారం అంటారు గదా. ఎమన్నా అనుకోండి నిజం చెప్పించలేరు అని మొండికేసి కూర్చున్నాడు. మొండివాడిని ఎవరూ ఏమీ చేయరుగ. అది సరే బావ ఈ పవన్ గోల ఏంటి. ఏముంది గతంలో సినిమాలు వినోదాత్మకంగా ఉంటే, ఇప్పుడు రాజకీయాలు వినోదాత్మకంగా తయారయ్యాయి. నా బాధ మీకేం తెలుసు. నేను పబ్లిక్‌లో మాట్లాడాలంటె ఎన్ని పుస్తకాలు రిఫర్ చేస్తున్నానో మీకు తెలియదు. వ్యవస్థ మారాలన్నా, పవర్‌లో ఉన్నా, పార్టీ మారాలన్నా కొంతమంది ప్రాణాలు వదలడానికి సిద్దపడాలి. ఈసారి ఎన్నికలలో గొడవలు జరుగుతాయి కనుక ప్రాణాలు వదలడానికి సిద్ధపడాలి. రోజుకు రెండు కోట్లు ఆదాయం వదులుకువచ్చా. నా యింట్లో సొమ్ము ఖర్చుపెడుతున్నా అలాగే మీరు ఖర్చు పెట్టండి ప్రాణాలు వదలడానికి సిద్ధపడకండని సైనికులకు మహోపదేశం చేస్తున్నాడు. అదా సంగతి, అందుకే 23 కాల్‌షీట్లు యిచ్చావు కాబట్టి రెండు కోట్లు చొప్పున 46 కోట్లకు పన్నుకట్టింది లేనిది దిల్లీ వెళ్లి తేలుస్తా అంటున్నాడు మంత్రి అంబటి. ఛీ ఛీ రాజకీయాలు ఇలా మారా ఏంటి బావ. గతంలో విమర్శలు ఎంతో హుందాగా ఉండేవి. అవి సద్విమర్శలు సమస్యలపై విమర్శలు. ఇప్పుడు వ్యక్తిగత విమర్శ లెక్కువ. ఇంట్లో ఆడవాళ్లను బజారు కీడుస్తున్నారు. వీరి వల్ల మహాసాధ్వి పతితగా మారుతోంది. అది సరే వీళ్ల నోటికి తాళం పడదా! ఏం పడుతుంది మనది ప్రజాస్వామ్య దేశం కదా అందుకే కోర్టులు కూడా ఆపలేకపోతున్నాయి. అది సరే చంద్రబాబు పర్యటనలో పోలీసుల దెబ్బలు తిన్నారేంటి. వయసు, రాజకీయ హుందాతనం మరిచి చంద్రబాబు మాట్లాడుతుంటే స్థానికులు ఊరుకోరు. మరి పోలీసులు ప్రభుత్వానికి తొత్తులు అంటారు. మరల వైసీపీ వారే పోలీసుల్ని కొట్టారంటాడు. పోలీసు అధికారులు వీడి ద్వారా ఎవరైనది తేల్చి కఠినంగా శిక్షిస్తామంటారు. అయినా దెబ్బతిన్న పోలీసులు ఎన్నికల రోజు వారి ప్రతాపం చూపిస్తారు. పవన్, చంద్రబాబు ప్రసంగాలు వారికే నష్టం చేకూర్చేలా ఉన్నాయని కొందరు విశ్లేషకుల భావన. మరి అందుకేగా మోదీ మౌనరాగం అందుకున్నారు. అయినా ఒక్క మణిపూర్‌లోనే ఘర్షణలు ఆపలేని కేంద్రం దిగిపోవడం మంచిదని కూడా పెద్దలంటున్నారు. అందుకే మోదీజీ ఇక చాలు అంటున్నారు ప్రజలు.

ప్రశాంతమైన మేవాత్‌లో అగ్ని జ్వాలలు

విభూతీ నారాయణ్ రాయ్

హర్యానాలోని నూహ్‌లో గతవారం మతపరమైన హింస ప్రారంభమైన సమయంలో ఏమి జరిగిందనే విస్తృత వివరాల్లోకి వెళ్లకుండానే చట్టాన్ని అమలుచేసే సంస్థల అధీనంలోనే మొత్తం దుర్ఘటనలన్నీ కొనసాగాయని చెప్పవచ్చు. ఈ సందర్భంగా హర్యానా పోలీసులలో ఎలాంటి వృత్తిపరమైన నైపుణ్యం, నిబద్ధత కనిపించలేదు. సత్వర ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న హర్యానా లాంటి చోట్ల శాంతి భద్రతలను పరిరక్షించడంలో హర్యానా పోలీసులు చాలా సమర్థవంతంగా వ్యవహరించి ఉండాలి. కానీ ఎక్కడా ఆ ఛాయలే కనిపించలేదు. మొదట్లోనే పరిపాలనా విభాగం స్పందించిన తీరు, వారు వేసుకున్న ప్రణాళిక అత్యంత నాసిరకంగా ఉన్నాయి. ఆ తరవాత పాలనా విభాగం, చట్టాన్ని అమలు చేయవలసిన బాధ్యత ఉన్న పోలీసు బలగాలలో పక్షపాత ధోరణి కొట్టొచ్చినట్టు కనిపించింది. పోలీసుదళాలలో క్రియారాహిత్యం ప్రస్ఫుటంగా కనిపించింది. హింసాకాండ చెలరేగుతుంటే పోలీసులు చేతులు ముడుచుకుని తమాషా చూస్తూ ఉండిపోయారు.

ఆకాశహర్మ్యంలోని ఇరవయ్యవ అంతస్తునుంచి చూస్తే రోడ్డు మీదనుంచి వెళ్తున్న ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నరకండి–చంపండి అని అరుస్తూ ఉంటే మనసు ఎలా ఉంటుంది? ఆ ప్రాంతంలోని సమస్త ఆస్తులను అగ్నికి ఆహుతి చేస్తుంటే ఏమనిపిస్తుంది? వారి మధ్య సమన్వయం ఎలా కుదిరిందనుకోవాలి? ఆ సమన్వయం ఎలా సాధ్యమై ఉంటుంది అని ఆలోచిస్తే హృదయం బండబారి పోతుంది. దహన కాండకు పాల్పడుతున్న వారిలో కొంచెపు మనుషులే కనిపిస్తారు. నరకండి–చంపండి అనే సాఫ్ట్‌వేరు ఉద్యోగిలోనూ అదే కొంచెపు మనిషే కనిపిస్తాడు. ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫార్చ్యూన్ 500 కంపెనీలో ఏదో ఒక బహుళజాతి కంపెనీలోనో పనిచేయడానికి వచ్చినప్పుడు గుర్‌గావ్ క్రమంగా విస్తరిస్తోంది. అప్పుడు గుర్‌గావ్ ఓ ఎదుగుతున్న నగరం. 1980–90ల్లో ఇదీ పరిస్థితి. ఆ రోజుల్లో భారత్ ప్రజలను కంప్యూటర్ అక్షరాస్యులుగా మార్చడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. అప్పుడు భారత్‌లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అయిదవ స్థానంలో ఉంటే ఇప్పుడు మూడవ స్థానానికి చేరామని సంబరపడి పోతున్నాం. ఈ బహుళ అంతస్తుల ఆకాశహర్మ్యాలు, విశాలమైన రోడ్లు, ఆధునిక పరిశ్రమలు ఆధునికమవుతున్న నగరంలో హింసకు తావు లేకుండా చేస్తారని ఆశించాం. కానీ ఆ ఆశలు కలలుగానే మిగిలిపోయాయి. గుర్‌గావ్ లో జులై 31న ప్రారంభమైన కొన్ని ఘటనలు మన ఆలోచనలను, ఆశలను, అంచనాలను తారుమారు చేసేశాయి.

మేవాత్ ప్రాంతంలో అంత అభివృద్ధిచెందని నూహ్ జిల్లాలో జరిగిన సంఘటనలు చాలా త్వరితంగా వ్యాపించాయి. గుర్‌గావ్‌కు విస్తరించడం అంటే ఆధునిక పారిశ్రామిక సంస్కృతిని భుజాన మోయవలసిన నగరంలో అనాగరికత పురివిప్పినాట్యం చేస్తోందన్న మాట. ఆలయంలో శివుడికి జలాభిషేకంకోసం ప్రారంభమైన ఒక ఊరేగింపుతో హింసాత్మక ఘటనలు ప్రారంభమైనాయి. కానీ ఎప్పుడూ లేనిది ఈసారి ఈ ఊరేగింపులో పాల్గొన్నవారు కర్రలు, పెద్ద పెద్ద కరవాలాలతో పాల్గొన్నారు. గత వంద సంవత్సరాలుగా దేశంలోని పోలీసులు మతపరమైన సమావేశాలకు, ఊరేగింపులకు అనుమతి ఇవ్వడంలో దాదాపు ఒకే రకమైన కొలమానాలే పాటిస్తున్నారు. కొత్త ఊరేగింపులకు అంత సులభంగా అనుమతి ఇవ్వరు. భారతీయ సమాజం మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి నియమాలు అనుసరిస్తున్నారు. ఎందుకంటే చిన్న సంఘటన కూడా నిప్పుకణికలా మారి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని భస్మం చేయవచ్చు. ఊరేగింపునకు అనుమతిచ్చే ముందు పోలీసులు నిర్వాహకులతో సంప్రదింపులు జరుపుతారు. సంభాషిస్తారు. ఊరేగింపు ఏయే వీధులగుండా వెళ్తుందో ఉభయపక్షాల వారూ నిర్ధారించుకుంటారు. ఆ ఊరేగింపులో ఎంతమంది పాల్గొనవచ్చుననే అంచనా కూడా ఉంటుంది. ఎలాంటి నినాదాలుంటాయో కూడా తేలుతుంది. ఒకవేళ ఊరేగింపు భిన్న మతాలవారు నివసించే ప్రాంతాల గుండా వెళ్లవలసివస్తే తగిన కట్టుదిట్టం చేస్తారు. ఊరేగింపు వెళ్లేదారిలోని పోలీసుస్టేషన్లలో కూడా దీనికి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంచుతారు. నూహ్‌లో శోభాయాత్రలు నిర్వహించే సంప్రదాయం నాలుగేళ్ల కిందే మొదలైంది. ఇది హర్యానాలో మారుతున్న రాజకీయ సమీకరణల పర్యవసానం కావచ్చు. పత్రికల్లో వెలువడిన పోలీసు అధికారుల ప్రకటననుబట్టి చూస్తే పోలీసులు నియమ నిబంధనలన్నింటినీ క్షుణ్ణంగా పాటించారనిపించడం లేదు. నిబంధనలను సక్రమంగా పాటించి ఉంటే ఊరేగింపులో పాల్గొనే వారి చేతిలో లాఠీలు, కరవాలాలను ఎలా అనుమతించారు? ఒకవేళ వారు అనుమతి లేకుండానే సాయుధులై ఊరేగింపులో పాల్గొంటే వారిని ఎందుకు ఆపలేదు?

ఊరేగింపు పొడవునా వినిపించిన నినాదాలు కూడా పనిగట్టుకుని రూపొందించినవనిపిస్తోంది. ఈ ఊరేగింపుకన్నా రెండు, మూడు రోజుల ముందు నించే సామాజిక మధ్యమాలలో రెచ్చగొట్టే, భయకంపితుల్ని చేసే సందేశాలు వస్తుంటే పోలీసు యంత్రాంగానికి ఆ విషయం తెలియదనుకోలేం. ఇలాంటి పరిణామాలు జరుగుతూ ఉంటే హింస ప్రజ్వరిల్లడంలో ఆశ్చర్యం లేదు. ఈ బీభత్సాన్ని నివారించడానికి పోలీసులు ప్రయత్నం చేసిన దాఖలాలే కనిపించడంలేదు. నూహ్ లోనూ, ఆ పరిసర ప్రాంతాలలోనూ ప్రజ్వరిల్లిన హింస శూన్యంలోంచి పుట్టిందేమీ కాదు. కొద్ది సంవత్సరాలుగా పశువుల వ్యాపారంచేసే వారిని నడిరోడ్డున పట్టుకుని హింసించడం సాగుతూనే ఉంది. రాజస్థాన్‌లోని భివానీ జిల్లాలో 2023 ఫిబ్రవరి 15న జునైద్, నాసిర్ ను మూకదాడిలో అంతమొందించడానికి కొద్ది రోజుల ముందు కూడా సామాజిక మాధ్యమాలలో ఇలాంటి రెచ్చగొట్టే ప్రచారమే సాగింది. రాజస్థాన్, హర్యానా పోలీసులమధ్య వివాదం కారణంగా కొన్ని నెలల తరవాత కాని నిందితులను అరెస్టు చేయనేలేదు. ఈ సంఘటనలోని ఒక నిందుతుడు అసలు సంఘటన జరగడానికి ముందే ప్రచారంలో పెట్టిన రెచ్చగొట్టే వీడియో ఒకటి బయట పడింది. దీనితో పరిస్థితి దిగజారడం, ద్వేష భావం వ్యాపించడం మొదలైంది.

హర్యానాతో పాటు మరికొన్ని రాష్ట్రాలలో విస్తరించి ఉన్న మేవాత్‌లో స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఇతర ప్రాంతాలలోలాగా మతకలహాలు ఎన్నడూ జరగలేదు. దేశ విభజన తరవాత ముస్లింలు మేవాత్ నుంచి వెళ్లిపోకుండా గాంధీజీ ప్రయత్నించారు. మేవాత్‌లోని ప్రజలు తమను తాము ముస్లిములుగా భావించడం కన్నా మేవాలమనే భావిస్తారు. ఈ వర్గంవారి ఆచార వ్యవహారాల్లో హిందూ సంప్రదాయాలు స్పష్టంగా కనిపిస్తుంటాయి. ఈ కలివిడి లక్షణమే తీవ్రవాద భావాలున్న వారికి కంటగింపైంది. సాంప్రదాయికంగా మేవాలు వ్యవసాయ దారులు, పశు పాలకులు. వీరు గుర్‌గావ్, ఆల్వార్, నూహ్, భరత్‌పూర్ లాంటి పట్టణ ప్రాంతాలలోనే ఎక్కువగా నివసిస్తారు. గ్రామాల నుంచి నగరాలకు వలసలు పెరిగిపోయిన తరవాత మేవాల వంటి వారు పట్టణ ప్రాంతాలలో ఉండడం కొత్తగా వచ్చిన వారికి నచ్చలేదు. వారితో ఘర్షణకు కాలు దువ్వేవారు. ఇటీవలి మత కలహాల తరవాత మేవాల ఇళ్లు బుల్‌డోజర్లతో ధ్వంసం చేశారు. ఒక దుకాణం ఎదురుగా అంటించిన పోస్టర్‌లో ఇక్కడ కేవలం హిందూ కార్మికులే పనిచేస్తారు అని రాసి ఉంది. ఇలాంటి పరిణామాలు నిరాఘాటంగా కొనసాగితే ఆశ్చర్య పడవలసిన పనేలేదు. ఒక మతానికి చెందిన వారే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి అనే పరిస్థితి కూడా రావచ్చు. ఇదే జరిగితే 1980–1990 దశకాలలో కన్న కలలు చెదిరిపోవడమే కాక బర్బరత్వం మరింత పెరగక తప్పదు. అంతే కాదు దేశాన్ని అయిదు ట్రిలియన్ డాలర్లు ఉన్న ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం అన్న ఊహా సౌధాలన్నీ పిచ్చుక గూళ్లలా చెదిరిపోయాయి.

ఆల్ ఇండియా అరసం అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు, యూపీ మాజీ డి.జీ.పీ.

అగ్నిహోత్రికి కోపమొచ్చింది...!

ఎం. కోటేశ్వరరావు

కాశ్మీరీ ఫైల్స్ సినిమాతో డబ్బుకు డబ్బు, కాషాయ దళాలను ఎంతగానో రంజింపచేసి వారి మద్దతుపొందిన వివేక్ రంజన్ అగ్నిహోత్రిని మణిపూర్ ఫైల్స్ గురించి అడగ్గానే అగ్నిహోత్ర అవధానులయ్యారు. అగ్నిహోత్రి సంఘపరివార్ సభ్యుడా లేక అనేకమంది మాదిరి ముసుగులో ఉన్న అదే తెగ సినిమారంగ పెద్దమనిషా అన్నది పక్కన పెడదాం. మణిపూర్ ఫైల్స్ సినిమా ఎందుకు తీయరు అని ప్రశ్నించిన వారిమీద నేను తప్ప వేరే మగాళ్లే లేరా అంటూ మండిపడ్డారు. ఎదురుదాడికి దిగారు. కాశ్మీరీ ఫైల్స్ సినిమా 2022లో ప్రపంచమంతటా 350 కోట్ల రూపాయలను వసూలుచేసి హిందీ సినీరంగంలో ఒక రికార్డు నెలకొల్పింది. దాని కొనసాగింపుగా మరింతగా సొమ్ము చేసుకొనేందుకు, ప్రచారపర్వంలో భాగంగా కాశ్మీరీ ఫైల్స్ అన్ రిపోర్టెడ్ పేరుతో అంటే వెలుగులోకి రాని కాశ్మీరి పండిట్ల ఉదంతాల పేరుతో ఒక సిరీస్ విడుదల చేయనున్నారు. తొలి భాగం ఆగస్టు 11న జీ5లో ప్రసారం కానుంది. తాము పరిశోధించిన దానిలో పదినుంచి ఇరవై శాతమే ఈ సిరీస్‌లో చూపనున్నామని, వాస్తవ గాధలను వీటిలో చూస్తారని, తమ పరిశోధన సారాన్ని కాశ్మీరీ ఫైల్స్ సినిమాగా తీశామని అగ్నిహోత్రి చెప్పారు. ఇది రాజకీయ ప్రచారంకోసం అన్నది వేరే చెప్పనవసరం లేదు. కాశ్మీరీ పండిట్ల మీద జరిగిన దాడుల గురించి అప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలేవీ దాచలేదు, వార్తల మీద ఆంక్షలు విధించలేదు. వాటిని అన్ని పార్టీలూ ఖండించాయి. నేడు మణిపూర్ ఉదంతాల మీద జరిగినట్లుగా పార్లమెంటు దద్దరిల్లలేదు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న విపి సింగ్ ప్రభుత్వానికి బీజేపీ కూడా వెలుపలి నుంచి మద్దతు ఇచ్చింది. రాముడి రథయాత్ర పేరుతో 1990 నవంబరు రెండున అయోధ్యకు చేరుకున్న కరసేవకులను నిరోధించేందుకు నాడు అధికారంలో ఉన్న ములాయం సింగ్ ప్రభుత్వం కాల్పులు జరపటానికి దారితీసిన పరిస్థితి తరువాత బీజేపీ దానికి నిరసగా కేంద్రంలో విపి సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది తప్ప కాశ్మీరీ పండిట్ల మీద జరిగిన దాడులకు కాదు. మూడుదశాబ్దాల తరువాత నాటి ఉదంతాలపేరుతో సినిమాతీసిన వివేక్ అగ్నిహోత్రి వర్తమానమణిపూర్‌ఫైల్స్ గురించి పరిశోధనాలేదు, సినిమాలేదు.

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం జరిపిన ఉదంతం ప్రపంచమంతటినీ కదిలించింది. వివేక్ అగిహోత్రి ఒక సంఘపరివార్ విధేయుడిగా స్పందించారు. ఆ ఉదంతాన్ని తక్కువచేసి చూపేందుకు బీజేపీ ఎత్తుగడనే ఆ పెద్దమనిషి కూడా అనుసరించి తన నిబద్దతలో ఎలాంటి సడలింపులేదని ప్రదర్శించుకున్నారు. వెలుగులోకి రాని కాశ్మీరీ పండిట్ల ఉదంతాలు అనే సిరీస్‌ను విడుదల చేస్తున్నట్లు అగ్నిహోత్రి ట్విటర్ ద్వారా, ఇతరంగా ప్రకటించారు. కాశ్మీరీ హిందువులను ఊచకోత కోస్తే భారత న్యాయవ్యవస్థ దాన్ని చూడకుండా, మౌనంగా నిస్సహాయంగా ఉందని ధ్వజమెత్తారు. మన రాజ్యాంగం వాగ్దానం చేసినట్లుగా కాశ్మీరీ హిందువుల జీవిత హక్కును రక్షించేందుకు తనంతట తానుగా స్పందించటంలో విఫలమైంది, ఇప్పటికీ విఫలమౌతూనే ఉంది అని ఆరోపించారు. మణిపూర్ ఉదంతాల మీద నెలల తరబడి మౌనంగా ఉన్న ప్రధాని మోదీ మీద అదే స్పందన ఎందుకు వెల్లడించలేదు ? నిజానికి అగ్నిహోత్రి కడుపు మంట కాశ్మీరీ పండిట్ల మీద స్పందించలేదు అన్నదాని



కంటే మణిపూర్ మీద నోరు విప్ప నోరు విప్ప అంటూ ప్రధాని నరేంద్రమోదీ నోటికి వేసుకున్న తాళాన్ని న్యాయవ్యవస్థ తీయించిందన్న దుగ్దను ఆ రూపంలో వెల్లడించుకున్నారు. సమయాన్ని వృధా చేయకండి మీరు దమ్మున్న మగాడే అయితే అక్కడికి వెళ్లండి, మణిపూర్ ఫైల్స్ సినిమా తీయండి అని దాని మీద ఒక ట్విటర్‌లో సవాలు విసిరారు. ఒక ప్రముఖుడి నుంచి అలాంటి ట్వీట్ వెలువడితే వేరు. కానీ ఆ సాధారణ ట్వీట్ మీద స్పందించి మీకు నా మీద విశ్వాసం ఉన్నందుకు కృతజ్ఞతలు, కానీ నన్ను అన్ని సినిమాలూ తీయాలంటున్నారు దమ్మున్నవారు ఇంకెవరూ లేరా అని ఎదురుదాడికి దిగి అతి తెలివి ప్రదర్శించారు.

అంతకు ముందు వివేక్ అగ్నిహోత్రి మణిపూర్ మీద ట్వీట్లు చేశారు, ఒక కవితను కూడా రాశారు. ఒక ట్వీట్‌లో ఇలా ఉంది. " మణిపూర్ : మోప్లా, డైరెక్ట్ యాక్షన్ డే (ప్రత్యేక దేశంగా పాకిస్తాన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోకపోతే 1946 ఆగస్టు 11న ప్రత్యక్ష కార్యాచరణ దినాన్ని పాటిస్తామని ముస్లింలీగ్ నేత జిన్నా అదే ఏడాది జూలైలో చేసిన ప్రకటన), నౌఖాలీ, బంగ్లాదేశ్, పంజాబ్, కాశ్మీర్, బెంగాల్, కేరళ, అసోం, బస్తర్ ఇప్పుడు మణిపూర్...ప్రతిసారీ అంతిమంగా మన అమాయక తల్లులు, సోదరీమణులు అమానుష,ఆటవిక చర్యలకు బలౌతున్నారు.

ఒక భారతీయుడిగా, ఒక పురుషుడిగా, ఒక మనిషిగా ప్రతిసారీ నా ధైర్యం చెదిరింది, నేను సిగ్గుపడ్డాను, నా చేతగాని తనానికి అపరాధన భావనతో ఉన్నా అని పేర్కొన్నారు. ఇక ఆ పెద్దమనిషి కవితా స్పందన గురించి చూద్దాం. " ఓ మణిపూర్... నేను యత్నించా...నేను యత్నించా... కానీ విఫలమయ్యా......నా నైపుణ్యంతో ఇప్పుడు నేను చేయగలిగింది వారి విషాదగాధలను చెప్పటమే, కానీ అప్పటికి అది ఎంతో ఆలశ్యం అవుతుంది...... ఎంపిక చేసుకున్న, అతితో కూడిన పోటీ తత్వపు ఎన్నికల రాజకీయాలకు మనమందరం బాధితులం.....మనమందరం మత అతి బాధితులం..... మనమందరం ప్రమాదకర మీడియా బాధితులం.....మనం భారత పౌరులం, బాధితులం........స్వేచ్ఛా భారతంలో జీవన హక్కులేదు, దాని గురించి మనమేమీ చేయలేం...... ఇది నేను కోరుకున్న స్వేచ్ఛ కాదు.... ఇలాంటి ప్రజాస్వామ్యం కాదు నేను కోరుకున్నది...... పరస్పరం కొట్టుకున్నవారి రక్తంతో ఒక అఖాతాన్ని మనతో ఏర్పాటు చేయిస్తే దానికి అర్ధమే లేదు.....మనది ఒక విఫల సమాజం.... నా సోదరీమణులారా నేను విచారిస్తున్నాను.... నా తల్లులారా నేను విచారిస్తున్నాను.......భారత మాతా నేను విచారిస్తున్నాను." ఇలా సాగింది ఆ కవిత.

ఇది చదివిన తరువాత ఎవరిలోనైనా తలెత్తే ప్రశ్న ఏమిటంటే దానిలో ఎక్కడైనా మణిపూర్ దురాగతానికి పాల్పడిన శక్తుల గురించి ఖండన ఉందా ? దాని మీద రెండు ఇంజన్ల పాలకపార్టీ, ప్రభుత్వాల తీరుతెన్నుల మీద అధిక్షేపణ ఎక్కడైనా ఉందా? మూడు దశాబ్దాల క్రితం జరిగిందని చెబుతున్న, అతిశయోక్తులతో కూడిన కాశ్మీరీ ఫైల్స్ సినిమాను తీశారు. ఇప్పుడు కొనసాగింపుగా సిరీస్‌ను ఇప్పుడెందుకు తీస్తున్నట్లు ? మణిపూర్ గురించి తాను సినిమా తీసేసరికి ఎంతో ఆలశ్యం అవుతుందని చెప్పటాన్ని ఏమనాలి? తప్పించుకొనే ఎత్తుగడ తప్ప ఇంకేమైనా ఉందా ?

మతోన్మాదం, కాషాయీకరణ దేశాన్ని వీడాలి

లోక్‌సభలో 'క్విట్ ఇండియా' ప్రస్తావనపై చౌదరి

న్యూఢిల్లీ: మతోన్మాదం, మతం పేరిట ప్రజలను విభజించడం, కాషాయీకరించడం వంటివి దేశాన్ని వీడేందుకు సమయం ఆసన్నమైందని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి వ్యాఖ్యానించారు. క్విట్ ఇండియా 81వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారసత్వవాదం, అవినీతి, మెప్పు రాజకీయాల పేరిట కాంగ్రెస్, ఇండియా కూటమిపై దాడి చేస్తూ, బీజేపీ సభ్యులు చేసిన నినాదాలకు ఆయన పై విధంగా స్పందించారు. గురువారం లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చలో చౌదరి మాట్లాడుతూ మోదీ 100సార్లు ప్రధాని కావడం గురించి ఆందోళన లేదుగానీ దేశ ప్రజల గురించే కాంగ్రెస్ ఆవేదనని వ్యాఖ్యానించారు. 1942లో మహాత్మాగాంధీ నేతృత్వ క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తుచేస్తూ 'క్విట్ ఇండియా జరగాలి.. ఎందులో అంటే మత్మోన్మాదం, కాషాయీకరణ, విభజన వంటివి దేశాన్ని వీడాలని నొక్కిచెప్పారు. మణిపూర్ ప్రజలకు శాంతి సందేశాన్ని ప్రధాని ఇవ్వాలని, కనీసం మన్ కీ బాత్ కార్యక్రమంలో దాని గురించి మాట్లాడాలని కాంగ్రెస్ కోరుకుందని చెప్పారు. 'హణిపూర్‌లో హింస తేలిగ్గా తీసుకునే అంశం కాదు. మణిపూర్‌లో గిరిజన తెగల మధ్య హింస జరుగుతోంది. పౌర యుద్ధం సాగుతోంది. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. యూరోపియన్ పార్లమెంటు, అమెరికాలోనూ దీనిపై చర్చ జరిగింది. దీనిని కేవలం రాష్ట్రానికి పరిమితం చేయరాదు. అందుకోసమే ప్రధాని జోక్యం అనివార్యం' అని చౌదరి అన్నారు. లోక్‌సభలో ప్రధాని ఉండాలనే ఉద్దేశంతోనే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం ఇండియా కూటమికి లేదని తెలిపారు. హస్తినాపురమైనా, మణిపూర్ అయినాగానీ మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న దాని గురించి రాజు పట్టించుకోకుండా ఉండరాదని మహాభారతాన్ని ప్రస్తావించారు. తన ప్రసంగంపై ప్రధానికి అభ్యంతరం లేనప్పుడు అమిత్‌షాకు ఉలుకు ఎందుకని చౌదరి ప్రశ్నించారు. చౌదరి చేసిన కొన్ని వ్యాఖ్యలను స్పీకర్ ఓం బిర్లా తొలగించారు. మణిపూర్‌లోని రెండు ఘర్షణ వర్గాల మధ్య బఫర్ జోన్ ఏర్పాటు గురించి హోంమంత్రి మాట్లాడకుండా ఉండాల్సిందని చౌదరి అన్నారు. రెండు దేశాల మధ్య నియంత్రణ రేఖలోనూ బఫర్ జోన్ ఉందని గుర్తుచేశారు.

అవిశ్వాస తీర్మానంపై చర్చలో మణిపూర్‌కు చెందిన ఇద్దరు ఎంపీలను మాట్లాడనివ్వలేదని విచారం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకుగాను సభకు, దేశానికి కాంగ్రెస్ నేత క్షమాపణ చెప్పాలని చౌదరిని ఉద్దేశించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ట్వీట్ చేశారు. పిచ్చి వ్యాఖ్యలు చేయడానికి కాంగ్రెస్ నేతలు తమలో తామే పోటీ పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

సభాహక్కులను ఉల్లంఘించిన అమిత్‌షా

కాంగ్రెస్ ఆరోపణ

'కళావతి' వ్యాఖ్యలపై ప్రివిలేజ్ నోటీసు

న్యూఢిల్లీ: మహారాష్ట్రకు చెందిన కళావతి గురించి కథ చెప్పి పార్లమెంటును తప్పుదోవ పట్టించినందుకు అమిత్‌షాపై హక్కుల నోటీసును లోక్‌సభలో కాంగ్రెస్ గురువారం సమర్పించింది. మహారాష్ట్ర, విదర్భలో వ్యవసాయ సంక్షోభం రావడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో వితంతువు కళావతి బందుర్కర్‌ని 2008లో కలిసి రాహుల్ గాంధీ పరామర్శించారు. ఈ భేటీ గురించి సభకు అమిత్‌షా అబద్ధాలు చెప్పారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు హక్కుల నోటీసులను స్పీకర్ ఓం బిర్లాకు పార్టీ విప్ మాణిక్‌రామ్ ఠాకూర్ అందజేశారు. బుధవారం అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగినప్పుడు 13సార్లు విఫలమైన ఎంపీ రాహుల్ గాంధీ అని అమిత్ షా విమర్శించారు. పేద మహిళ కళావతి గురించి మాట్లాడారు. ఆమెకు ఇల్లు, ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. అయితే మోదీ ప్రభుత్వం అబద్ధం చెబుతోందంటూ ఓ వీడియోను ఎక్స్ (ట్విట్టర్)లో కాంగ్రెస్ పెట్టింది. రాహుల్ సాయంతో ఆమె పేదరికంలో నుంచి బయట పడగలిగినట్లు వెల్లడించింది. పార్లమెంటరీ హక్కులను అతిక్రమించినట్లు అమిత్‌షాపై ఠాకూర్ ఆరోపణలు చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చి అవాస్తవాలను సభలో మాట్లాడారని, లోక్‌సభ నిబంధనలోని అధ్యాయం 20, నిబంధన 22 కింద హక్కులను అతిక్రమించారని ఆరోపించారు. పార్లమెంటరీ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడేందుకు, జవాబుదారీతనానికి హామీ ఇచ్చేందుకుగాను అమిత్‌షాపై తగు విధంగా చర్యలు తీసుకోవాలని నోటీసులో ఠాకూర్ కోరారు.

మోదీ ప్రభుత్వానికి చర్చించాలని లేదు

మణిపూర్ వ్యవహారంలో జైరాం రమేశ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసపై రాజ్యసభలో చర్చించాలని మోదీ ప్రభుత్వం కోరుకోవడం లేదని, ఈ విషయంతో నా దారే రహదారి అన్న చందంగా మొండిగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. మణిపూర్‌పై చర్చ కోసం తీర్మానానికి సంబంధించి రాజ్యసభలో ఇండియా కూటమి సభ్యులు చేసిన ప్రతిపాదనను అధికార పార్టీ ఎంపీలు వ్యతిరేకించారు. ప్రధాని సభకు రావాలన్న డిమాండ్‌ను తిరస్కరించారు. దీంతో గందరగోళం నెలకొనడంతో భోజన విరామానికి ముందు ఎగువసభ వాయిదా పడింది. నిబంధన 267 కింద చర్చ కోసం ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. దీని కింద ఓటింగ్ నిర్వహించాలి, ప్రధాని మోదీ ప్రకటన చేయాలి. కానీ నిబంధన 176 కింద స్వల్పకాలిక చర్చ కోసం ప్రభుత్వం పట్టుబట్టింది. ఈ ప్రక్రియలో ఓటింగ్ లేక ఏ మంత్రి సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

'ఇండియా' ఎంపీలు వినయ్ విశ్వం (సీపీఐ), ఇలామరమ్ కరీం (సీపీఎం), తిరుచీశివ (డీఎంకే) మణిపూర్‌లో అల్లర్లపై నిబంధన 167 కింద అర్థవంతమైన చర్చ కోసం తీర్మానాన్ని రాజ్యసభలో గురువారం సమర్పించినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. 'ప్రతిష్ఠంభనను పరిష్కరించేందుకు సభాపతి యత్నిస్తున్నారు. ఇందుకోసం ముసాయిదాపై అంగీకారం కోసం పరస్పరం చర్చలు జరిపేందుకు ఇండియా కూటమిలోని పార్టీలు సుముఖంగా ఉన్నాగానీ మోదీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. నా మాటే నెగ్గాలన్నట్లు ప్రవర్తిస్తోంది' అని రమేశ్ పేర్కొన్నారు. బీజేపీ చర్చను కోరుకోవడం లేదని, రాజ్యసభలో మణిపూర్ గురించి ప్రధాని మాట్లాడరన్న పట్టుదలతో ఉందని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 167 నిబంధన కింద ప్రధాని సమక్షంలో చర్చకు అనుమతివ్వాలని చైర్మన్ జగదీప్ ధన్కర్‌ను కోరారు. అధికారపక్ష సభ్యులు నిరసన తెలుపగా సభకు ప్రధాని వస్తే ఏం జరుగుతుంది? ఆయన పరమాత్ముడా ఏమిటి? అని ఖర్గే ప్రశ్నించారు. దీంతో గందరగోళం నెలకొనగా మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది.

యూపీఏతో దశాబ్దం వృథా

పెరిగిన వృద్ధిరేటు

'ఇండియా'లో అన్నీ లుకలుకలే

నిర్మలా సీతారామన్ విమర్శలు

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నప్పటికీ భారతదేశ భవిష్యత్ వృద్ధి ఆశాజనకంగా ఉందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పుకొచ్చారు. మోదీ ప్రభుత్వం తమ హామీలన్నీ అమలు చేస్తోందని తెలిపారు. విపక్షాల కూటమి సభ్యులు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై నిర్మలా సీతారామన్ గురువారం ప్రసంగించారు. మూడోరోజు జరుగుతోన్న చర్చలో భాగంగా ఆమె మాట్లాడారు. తొలుత భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి గురించి ఆమె ప్రస్తావించారు. యూపీఏ ఒక దశాబ్దకాలాన్ని వృథా చేసిందని, అప్పటి సంక్షోభాలన్నీ ఇప్పుడు సంస్కరణలుగా మారాయని ఆమె వ్యాఖ్యానించారు. 2013లో మోర్గాన్ స్టాన్లీ.. భారత్‌ను ఐదు బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితాలో చేర్చిందని, భారత్‌ను బలహీన ఆర్థిక వ్యవస్థగా ప్రకటించిందని గుర్తుచేశారు. అదే సంస్థ ఇప్పుడు భారత్ రేటింగ్‌ను పెంచిందని, అంతేకాకుండా మెరుగైన రేటింగ్ ఇచ్చిందని గొప్పగా చెప్పుకున్నారు. కోవిడ్ వంటి సంక్షోభాలు వచ్చినప్పటికీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందని నిర్మలా సీతారామన్ చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. భారత్ తన భవిష్యత్తు వృద్ధి గురించి ఆశాజనకంగా ఉండే ఒక అరుదైన స్థితిలో ఉందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆమె ఏకరువు పెట్టారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం కారణంగా యూపీఏ ఒక దశాబ్దకాలాన్ని వృథా చేసిందని ఆర్థికమంత్రి ఆరోపించారు. ప్రతి సంక్షోభం ఇప్పుడు ఒక అవకాశంగా, సంస్కరణగా మారిందన్నారు. 2014, 2019లో ప్రజలు యూపీఏపై విశ్వాసం చూపించలేదని, ఆ దశాబ్దకాలంలో జరిగిన కుంభకోణాల వల్లే ప్రజలు యూపీఏను పట్టించుకోలేదన్నారు. 2024లో కూడా ప్రజలు యూపీఏపై విశ్వాసం చూపే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌ల గురించి ఆమె మాట్లాడారు. కర్నాటక ఆరోగ్యమంత్రి ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లు చూడటానికి వచ్చారు. వాటిని చూసిన మంత్రి అక్కడ ప్రత్యేకత ఏమీ లేదని చెప్పారని విమర్శించారు. విపక్ష కూటమిలోని పార్టీల భాగస్వామ్యాన్ని ఎద్దేవా చేశారు. పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్ పోరాడటాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ రెండు పార్టీలు విపక్ష ఇండియా కూటమిలో ఉన్నాయన్నారు. సీతారామన్ మాట్లాడుతున్న సమయంలో విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆమె సభను పక్కదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. ఇందిరాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గరీబీ హటావో నినాదం తీసుకొచ్చారని, వాస్తవంగా దీనివల్ల దేశంలో దారిద్ర్యం తగ్గిందా అని నిర్మల ప్రశ్నించారు. దీనిని ప్రధాని మోదీ పూర్తిగా మార్చివేశారన్నారు. అందరికీ సాధికార కల్పించడమే గానీ బుజ్జగింపులు ఉండవన్నారు. తమ హయాంలో రక్షణ ఎగుమతులు పెరిగాయని, ఆహార ఉత్పత్తి కొన్ని రెట్లు పెరిగిందని, తాము అమలు చేస్తున్న అనేక పథకాలు పేదరికం నుంచి ప్రజలను బయటపడేసేందుకు దోహదపడుతున్నాయని వివరించారు. ఎన్‌డీఏ హయాంలో బ్యాంకింగ్ రంగం మెరుగుపడిందన్నారు.

దిగజారిన చట్టసభలు

పార్లమెంటు నిర్వహణ తీరుపై దేవెగౌడ అసంతృప్తి



బెంగళూరు: పార్లమెంటు జరుగుతున్న తీరుపై మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. ఉభయసభల్లో కనీసం చర్చలు లేవు. ప్రజానుకూల నిర్ణయాలు లేవు. చర్చలు లేకుండానే చట్టాలు రూపొందిస్తున్నారు. అరుపులు, కేకలు, నినాదాలు, నిరసనలతోనే సరిపోతోందని విమర్శించారు. ప్రతిఒక్కరూ హుందాగా వ్యవహరిస్తేనే ప్రజాస్వామ్యానికి రక్షణ ఉంటుందని హితవు పలికారు. కర్నాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న 90 ఏళ్ల దేవెగౌడ...పార్లమెంటులో పరిణామాలపై ఆగ్రహం వెలిబుచ్చారు. 'ఆరోగ్యం సహకరించకపోయినా నేను పార్లమెంటుకు వెళ్లాను. అయితే, అక్కడ జరుగుతున్న పరిణామాలు తీవ్ర అసంతృప్తికి గురిచేశాయి. చట్టసభలు ఇంతదారుణంగా దిగజారడం నా సుదీర్ఘ అనుభవంలో ఇదే మొదటిసారి. అందరూ హుందాగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్యానికి రక్షణ' అని ట్విట్టర్ వేదికగా దేవెగౌడ అభిప్రాయపడ్డారు. అరుపులు, కేకలు, నినాదాలు మన వ్యవస్థను ధ్వంసం చేస్తాయని పేర్కొన్నారు. మణిపూర్‌పై రూల్ 167 కింద చర్చించాలని, ఆ సమయంలో ప్రధాని నరేంద్రమోదీ సభలో ఉండాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఖర్గే డిమాండ్‌ను తోసిపుచ్చుతూ అధికార పార్టీ సభ్యులు నిరసనకు దిగారు. 'ప్రధాని సభకు వస్తే ఏమవుతుంది? ఆయన ఏమైనా పరమాత్మనా? మోదీ దేవుడు కాదు' అని ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీని ఉద్దేశించి బీజేపీ సభ్యులు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో సభలో గందరగోళం చెలరేగింది. చైర్మన్ జగదీప్ ధన్కర్ సభను వాయిదా వేశారు.

ముంబై 'ఇండియా' భేటీకి హాజరవుతా: జయంత్

న్యూఢిల్లీ: ఆగస్టు 31, సెప్టెంబరు ఒకటవ తేదీన ముంబైలో జరిగే విపక్షాల కూటమి 'ఇండియా' భేటీకి తాను హాజరవుతున్నట్లు రాష్ట్రీయ లోక్‌దళ్ నాయకుడు జయంత్ చౌదరి గురువారం చెప్పారు. ఢిల్లీ సర్వీస్ బిల్లుపై ఓటింగ్‌కు జయంత్ చౌదరి దూరంగా ఉండటంతో ఆయన భవిష్యత్ కదలికలపై ఊహాగానాలు వెలువడ్డాయి. ఢిల్లీ బిల్లును ఇండియా కూటమి సభ్యులు వ్యతిరేకించిన విషయం విదితమే. తన భార్య ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో చౌదరి సభకు గైర్హాజరయ్యారని ఆయన సన్నిహితులు తెలిపారు. ముంబైలో జరిగే ఇండియా కూటమి సమావేశానికి తాను తప్పనిసరిగా హాజరవుతానని పీటీఐతో మాట్లాడుతూ చెప్పారు. పాట్నాలో విపక్షాల మొదటి సమావేశానికి హాజరుకాని జాట్ నాయకుడు జయంత్ రెండో భేటీకి హాజరయ్యారు.

రాజస్తాన్‌లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం: మిస్త్రీ

జైపూర్: రాజస్తాన్‌లో తమ పార్టీ మరోసారి సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్ మిస్త్రీ గురువారం ఆశాభావం వెలిబుచ్చారు. ఈ ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున రాజస్తాన్ ఎన్నికల పరిశీలకుడిగా మిస్త్రీని కాంగ్రెస్ అధిష్ఠానం ఇటీవల నియమించింది. పార్టీ నాయకులతో చర్చించడానికి మిస్త్రీ ఇక్కడికి వచ్చారు. విమానాశ్రయంలో మిస్త్రీ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మళ్లీ రాజస్తాన్‌లో అధికారం చేజిక్కించుకుంటుందని తెలిపారు. శాంతిభద్రతలు వంటి కొన్ని అంశాలలో రాజస్తాన్ ప్రభుత్వాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకున్న విషయాన్ని ప్రస్తావించగా ప్రజల్లో అయోమయం సృష్టించడమే బీజేపీకి తెలిసిన విద్య అని, ప్రజలకు సేవ చేయడం, పేదలను అభివృద్ధిపథంలోకి తీసుకురావడం కాంగ్రెస్ కర్తవ్యమని మిస్త్రీ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో రాజస్తాన్ ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రాజస్తాన్‌లో ఈడీ దాడుల అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రజలను బెదిరించడం, భయపెట్టడం, ప్రతికూలతల ద్వారా మాత్రమే విజయం సాధించాలని బీజేపీ కోరుకుంటుందని, కాంగ్రెస్‌కు అలాంటి విధానమే లేదని స్పష్టంచేశారు. మిస్త్రీకి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌సింగ్ దొటస్రా, ఇతర నాయకులు స్వాగతం పలికారు.

రాజ్యసభలో గందరగోళం

నేటికి వాయిదా

న్యూఢిల్లీ: మణిపూర్ మారణకాండ రాజ్యసభను కుదిపేస్తోంది. మణిపూర్ హింసపై చర్చించాలని ప్రతిపక్షాలు గురువారం పట్టుబట్టాయి. దీంతో రాజ్యసభ శుక్రవారానికి వాయిదా పడింది. అరుపులు, కేకల మధ్యనే ఫార్మసీ(సవరణ) బిల్లు-2023ను సభ ఆమోదించింది. అధికార, విపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ ఉదయం ప్రారంభమైన సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి 2 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు కోరిన నిబంధన కాకుండా మరో నిబంధన కింద మణిపూర్‌పై చర్చ ప్రారంభించడానికి చైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రయత్నించారు. ఆ సమయంలో అధికార, ప్రతిపక్షాల సభ్యులు ఆరోపణలు చేసుకున్నారు. సభ్యులు కొంతమంది కవితాత్మకంగా, హేళనలతో మాట్లాడి నవ్వులు పూయించారు. అయినా మణిపూర్‌పై చర్చకు అవకాశం లేకుండా పరస్పరం నిందించుకున్నారు. మిజోరం సభ్యుడు లేచి తనతో పాటు గిరిజనులు బ్రిటీష్ కాలం నుంచి భారత్‌లోనే జీవిస్తున్నారని, తాము మైన్మార్ నుంచి వలస రాలేదని చెప్పారు. ఆ తర్వాత ఆ సభ్యుడు మాట్లాడకుండా చైర్మన్ ధన్కర్ అడ్డుకున్నారు. ఆ మాటలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష సభ్యులంతా మిజోరం సభ్యుడికి మద్దతుగా నిలిచారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొంతమంది విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. చైర్మన్ బిల్లుల ఆమోదం కోసం ప్రయత్నించారు. తీవ్ర గందరగోళం మధ్య ఫార్మసీ(సవరణ) బిల్లును సభ ఆమోదించింది. గందరగోళం కొనసాగుతుండటంతో చైర్మన్ సభను రేపటికి వాయిదా వేశారు.

శ్రీనగర్ 'ఘంటా ఘర్'పై త్రివర్ణ పతాకం

శ్రీనగర్ : జమ్మూకశ్మీర్ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇటీవల మరమ్మత్తులు పూర్తి చేసుకున్న చారిత్రాత్మక ఘంటా ఘర్ (గడియార స్తంభం)పై గురువారం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. నగరానికి నడిబొడ్డున ఉన్న క్లాక్ టవర్‌ను శ్రీనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద ఇటీవలే మరమ్మత్తులు చేశారు. 76వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల నేపథ్యంలో గురువారం క్లాక్ టవర్‌కు పైభాగంలో మువ్వన్నెల జెండాను ఎగురవేశారని అధికారి ఒకరు తెలిపారు. శ్రీనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అతహర్ అమీర్ ఖాన్ మాట్లాడుతూ, నగరంలో జాతీయ జెండాను ఎగురవేయడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రచారంలో భాగంగా ఘంటా ఘర్, లాల్ చౌక్ శ్రీనగర్‌ని మువ్వన్నెల జెండాతో ముస్తాబు చేశామని అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రచారం కింద నగరంతో పాటు పలు చోట్ల తిరంగా ర్యాలీలలో పాల్గొంటు ప్రజలు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమవుతున్నారని ఖాన్ తెలిపారు. నగరంలోని వాణిజ్య కేంద్రమైన లాల్ చౌక్ ప్రాంతంలో నెల రోజులుగా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఖాన్, ప్రాజెక్ట్ చివరి దశలో ఉందని, స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ప్రారంభిస్తామని చెప్పారు. లాల్ చౌక్‌లో పనులు దాదాపు పూర్తయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవానికి ఇంకా నాలుగైదు రోజులు మాత్రమే ఉన్నాయి. ఇన్‌స్టాలేషన్, లైట్ ఫిట్టింగ్‌లు మొదలైన వాటితో సహా ముగింపు మెరుగులు జరుగుతున్నాయి. మేము ఆగష్టు 15లోపు మొత్తం పనిని పూర్తి చేసి, అంతకు ముందే ప్రారంభోత్సవం చేస్తామని ఖాన్ తెలిపారు.

సర్పంచ్‌లపై కఠినచర్యలు

కాంగ్రెస్ ఎమ్మెల్యే డిమాండ్

చండీగఢ్: గ్రామాల్లోకి ముస్లిం వ్యాపారులు రాకుండా నిషేధించిన పంచాయతీ సర్పంచ్‌లపై కఠినచర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అఫ్తాబ్ అహ్మద్ గురువారం డిమాండ్ చేశారు. ముస్లిం వ్యాపారాలు తమ గ్రామాల్లోకి రాకుండా మూడు జిల్లాలకు చెందిన పంచాయతీ సర్పంచ్‌ల పేరుపై లేఖలు వెలువడి సంచలనం సృష్టించాయి. ముస్లిం వ్యాపారాలు గ్రామాల్లోకి రావడం వల్లే నూహ్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని ఆ లేఖల్లో పేర్కొన్నారు. 'ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. ఏ పంచాయతీ అయినా అలా మాట్లాడినా లేదా తీర్మానం చేసినా కఠిన చట్టాలు ప్రయోగించి కేసులు నమోదు చేయాలి' అని అహ్మద్ డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు రాసినట్లు చెబుతున్న లేఖలు రాష్ట్ర శాంతియుత వాతావరణాన్నే కలుషితం చేసేలా ఉన్నాయని మండిపడ్డారు. నూహ్‌లో కూల్చివేతల ఘటనను అహ్మద్ తీవ్రంగా తప్పుబట్టారు. కొంతమంది నాయకులు, ప్రజలు లక్ష్యంగా ఇళ్లు, ఆస్తులు కూల్చివేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే చాలా నిర్మాణాలు కూల్చివేశారని, అక్రమ కట్టడాల పేరుతో అమాయక ప్రజలను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఇళ్లు కోల్పోయిన అమాయకులు నిలువ నీడలేకుండా ఉన్నారని చెప్పారు. బాధితులకు ఎలాంటి సదుపాయాలు కల్పించలేదన్నారు. హరియాణా ప్రభుత్వం తమ రాజ్యాంగ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించుకుంటుందని విమర్శించారు. ప్రస్తుతం నూహ్‌లో ప్రశాంత వాతావరణం ఏర్పడిందన్నారు.

నా గొంతు నొక్కడానికి బీజేపీ యత్నం

ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా

న్యూఢిల్లీ: నా గొంతు నొక్కడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చడ్డా మండిపడ్డారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ సర్వీసెస్ బిల్లును సెలెక్ట్ కమిటీకి నివేదించాలని ప్రతిపాదించేందుకు రాసిన లేఖపై బీజేపీ, బీజేడీ, ఏఐఏడీఎంకే ఎంపీల సంతకాలను తాను ఫోర్జరీ చేశానని బీజేపీ ఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. చడ్డా... నిబంధనలను ఉల్లంఘించి తమ అనుమతి లేకుండా సెలెక్ట్ కమిటీకి తమ పేరును ప్రతిపాదించారన్న నలుగురు ఎంపీల ఫిర్యాదులను పరిశీలించడానికి బుధవారం రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ ప్రివిలేజెస్ కమిటీకి పంపారు. కాగా తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చడ్డా స్పష్టం చేశారు. ఒక ఎంపీ... ఇతర సభ్యుల పేరును వారి రాతపూర్వక అనుమతి లేదా సంతకం లేకుండా సెలెక్ట్ కమిటీకి ప్రతిపాదించవచ్చని ఆయన నిబంధనల పుస్తకాన్ని చూపుతూ తెలిపారు. 'నాపై ఫోర్జరీ ఆరోపణలు చేసిన బీజేపీ లోక్‌సభ సభ్యులపై నేను ప్రివిలేజెస్ కమిటీ, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను' అని చెప్పారు. నిబంధనల ప్రకారం... సెలెక్ట్ కమిటీకి ఎవరైనా సభ్యుని పేరును ప్రతిపాదించడానికి సదరు సభ్యుడి సమ్మతి లేదా సంతకం అవసరం లేనప్పుడు తాను ఫోర్జరీ చేశాననడంలో అర్థం లేదన్నారు. ఎవరి సంతకం తీసుకుని సమర్పించనప్పుడు ఫోర్జరీ అనే ప్రశ్న ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఫోర్జరీ సంతకాల గురించి జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పు, నిరాధారమని అని చడ్డా పేర్కొన్నారు. బీజేపీకి ధైర్యముంటే తాము ఆరోపించినట్లు నకిలీ సంతకాలు ఉన్న కాగితాలను చూపించాలని ఆయన సవాల్ చేశారు. బీజేపీ తన గొంతును అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీని చూసి భయపడేది లేదని స్పష్టం చేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ విషయంలో చేసినట్లుగానే చడ్డాను రాజ్యసభకు అనర్హులుగా ప్రకటించడమే హోంమంత్రి అమిత్‌షా ఏకైక లక్ష్యమని ఆయన ఆరోపించారు.

ముస్లింలపై విద్వేషం సృష్టిస్తున్నారు: ఒవైసీ

న్యూఢిల్లీ: దేశంలో ముస్లింలు అణచివేయబడినప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటములు 'చౌకీదార్', 'దుకాన్‌దార్' రెండూ నోరు విప్పవని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై గురువారం ఒవైసీ మాట్లాడుతూ... ఈ రెండు కూటములు మైనారిటీల సమాధులపై రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. "ఈ దేశంలో రెండు ఫ్రంట్‌లున్నాయి. ఒకటి 'దుకాన్‌దార్', మరొకటి 'చౌకీదార్'. మనం అణచివేతకు గురైనప్పుడు ఎవరూ నోరు విప్పరు. ఉపా సవరణ చట్టాన్ని హోంమంత్రి అమిత్ షా తీసుకు రాగా ఈ దుకాన్‌దార్లు (కాంగ్రెస్) దానిని ఆమోదించారు" అని ఒవైసీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర కేబినెట్లో ఒక్క ముస్లిం మంత్రి కూడా లేరని విమర్శిం చారు. మణిపూర్లో హింస చెలరేగుతుంటే ఆ రాష్ట్ర సీఎంను ఎందుకు తొలగించలేదని నిలదీశారు. పాకిస్తాన్ జైల్లో మగ్గుతున్న రిటైర్డ్ నేవీ అధికారి కులభూషణ్‌ను ప్రధాని నరేంద్రమోదీ మర్చిపోయారని, ఆయనను ఎందుకు విడిపించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విద్వేషాలు రెచ్చగొట్టడట్ట మే పనిగా పెట్టుకుందని, ఉమ్మడి పౌరస్మృతితో దేశంలో నియంతృత్వాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తోం దన్నారు. అసెంబ్లీలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత చీర లాగిన ఘటనపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... బిల్కిస్ బానో ఈ దేశపు పుత్రిక కాదా అని ఒవైసీ ప్రశ్నించారు.

స్త్రీ రక్షణ గురించి మాట్లాడే మోదీ... బిల్కిస్ బానో ఈ దేశ బిడ్డ కాదా? ఆమెకు ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మొత్తం 11 ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. ప్రధానిమోదీ నేతృత్వం లో కేంద్రం ప్రభుత్వం చేస్తున్న రాజకీయాల వల్లే దేశానికి హాని కలుగుతుందన్నారు. దేశం కంటే హిందుత్వమే ప్రధాని మోదీకి ముఖ్య మైందని విమర్శిం చారు. సభలో హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఒవైసీ తీవ్రంగా ఖండించారు. క్విట్ ఇండియా గురించి అమిత్ షా మాట్లాడుతున్నారు. ఆ పదంమొదట ఉపయోగించింది ఓముస్లిం... ఈ విషయం తెలిస్తే అమిత్ షా ఆ పదాన్ని ఉపయోగించరేమోనని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ముస్లింలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ముస్లింలకు కేటాయించాల్సిన నిధుల్లో కోత పెట్టారన్నారు.

2021-22లో 'ఓలా' నికర నష్టం రూ.3,082 కోట్లు

న్యూఢిల్లీ : బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ యాక్సెస్ చేసిన ఆర్థిక డేటా ప్రకారం, ప్రయాణికుల ఆన్‌లైన్ రవాణా నెట్‌వర్క్ సంస్థ ఓలా క్యాబ్స్‌గా పేరు ప్రఖ్యాతులను పొందిన ఏఎన్‌ఐ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ 2021-22లో నికర నష్టం రూ. 3,082గా నమోదు చేసుకున్నట్లు తెలిపింది. ఏడాది ప్రాదిపదికన సంస్థ నష్టాలు రెండితలు పెరిగాయని గణాంకాలు తెలుపుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరానికి రాబడి 49 శాతం పెరిగి, రూ.1,350 కోట్లకు చేరిందని టోఫ్లర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021-22లో నికర నష్టం రూ.3,082గా సంస్థ నివేదించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 132 శాతం అధికమని పేర్కొంది. ఇదే ఆర్థిక సంవత్సరంలో సంస్థ మొత్తం వ్యయం రూ.1,539 కోట్లని తెలిపింది. ఓలా మనదేశంలో 250 కంటే ఎక్కువ నగరాల్లో సేవలందిస్తుంది. మనదేశంతో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో కూడా తన సేవల్ని అందిస్తుంది.

కార్మికవర్గం కన్నెర్ర

'క్విట్ ఇండియా' స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మోదీ వ్యతిరేక నిరసనలు

జంతర్‌మంతర్ వద్ద భారీ ర్యాలీ

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వినాశకర విధానాలపై కార్మికవర్గం కన్నెర్రచేసింది. దేశం వదిలివెళ్లిపోవా ల్సిందిగా వలసపాలకులకు మహాత్మాగాంధీ అంతిమ హెచ్చరిక చేసిన 'క్విట్ ఇండియా' ఉద్యమ దినోత్సవ స్ఫూర్తితో బుధవారం కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిపాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో కార్మికులు అన్ని ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బీజేపీ నాయకత్వంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానా లను నిరసిస్తూ ప్రదర్శనలు జరిపారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదికతోపాటు స్వతంత్ర సమాఖ్యలు, అసోసియేషన్లు కూడా ఈ పిలుపులో భాగం పంచుకుని నిరసన కార్యక్ర మాలు జరిపాయి. ఈ ఏడాది జనవరి 30న కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక జాతీయ సదస్సు ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా "దేశాన్ని రక్షించండి, ప్రజలను రక్షించండి" అనే నినాదంతో దేశవ్యాప్తంగా కార్మికులు ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల రాజ ధానులు, 700 జిల్లాలు, అనేక తాలూకా కేంద్రాలలో కార్మికులు, ఉద్యోగులు, శ్రామికజనం వేలాదిగా నిరసన ప్రదర్శనలు జరిపారు. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమర్‌జిత్ కౌర్ (ఏఐటీయూసీ) షెహనాజ్ (ఐఎన్‌టీయూసీ), హర్భజన్ సింగ్ (హెచ్‌ఎంఎస్), తపన్ సేన్ ((సీఐటీయూ) హరీష్ త్యాగి (ఏఐయూటీయూసీ), లతా బెన్(ఎస్‌ఈడబ్ల్యూఏ), రాజీవ్ దిమ్రి(ఏఐసీసీటీయూ), రషీద్ ఖాన్ (ఎల్‌పీఎఫ్), శత్రుజిత్ సింగ్ (యూటీయూసీ) తదితరులు ప్రసంగించినవారిలో ఉన్నారు. "స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఈ రోజు (క్విట్ ఇండియా దినోత్సవం)కు దేశంలో ఎంతో ప్రాధాన్యం ఉంది, బ్రిటీష్ వలస పాలకులను దేశం వదిలివెళ్లిపోవాలని పిలుపు ఇచ్చిన రోజు, వారిని మూటా ముల్లె సర్దుకుని దేశం వదిలి వెళ్లిపోవాల్సిందిగా హెచ్చరించిన రోజు, కానీ స్వాతంత్ర్యం సాధించిన తరువాత ఈ రోజున కూడా పరిస్థితులు బ్రిటీష్ పాలన కంటే కూడా చాలా అధ్వానంగా మారి పోయాయన్నారు.

ఇవేమి చర్చలు?

విద్యుత్ ఉద్యోగులలో ప్రభుత్వం చీలిక

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు విఫల మయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ అధ్వర్యంలో హనుమాన్‌పేట దాసరి భవనంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఓబులేసు మాట్లాడారు. విద్యుత్ రంగ ఉద్యోగులు రెండు జేఏసీలుగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు ఓబులేసు తెలిపారు. సమస్యలపై విడివిడిగా యాజమాన్యానికి, ప్రభుత్వానికి, కార్మికశాఖకు డిమాండ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. పవరు జేఏసీ సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించిందని, దానికి స్ట్రగుల్ కమిటీ తరపున మద్దతునిస్తూ బహిరంగ ప్రకటన చేశామని, నేటికీ దానికి కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వం పవరు జేఏసీ కమిటీతో మాత్రమే చర్చలు జరిపి... బుధవారం రాత్రి 11 గంటల తర్వాత చర్చలు సఫలమని ప్రకటించిందన్నారు. విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు పెద్దగా పరిష్కరించిన పరిస్థితి లేదన్నారు. మూడు డీఏలు ఇవ్వాల్సివుండగా ఒకటి ఇస్తామని, అందులోనూ బకాయిలు 12 విడతలుగా ఇస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. ఫిట్‌మెంట్ 45 శాతం అడగగా 8 శాతానికే ప్రభుత్వం అంగీకరించిందని, మాస్టర్ పీస్కేల్ కింద రూ.2.60 వేలు ఇచ్చారని, దీనివల్ల ఒక్కొక్కరికి రూ.40 వేల నుండి రూ.50 వేల వరకు నష్టం వస్తుందని, దీనిని ఇంజినీరింగ్ సెక్షన్ విభేదించి...చర్చలను బహిష్కరించదని వివరించారు. ఈ చర్చల క్రమాన్ని గమనిస్తే గూడుపుఠాణి జరిగినట్లు కనబడతోందన్నారు. ప్రభుత్వం తరపున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెద్ద మనిషిగా కనిపించినా... లోపల బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం, యాజమాన్యం దయాదాక్షిణ్యాలపై ఉద్యోగులు ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ట్రాన్స్‌కో, జన్‌కో, డిస్కంలలో అరవై వేలమంది శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఇంజినీర్లు పని చేస్తున్నారన్నారు. రెండు జేఏసీలతో కాకుండా ఒక జేఏసీతో తూతూమంత్రంగా చర్చలు జరిపి ముగించటం సరికాదని స్పష్టంచేశారు. మరో జేఏసీతో కూడా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు 2018 నాటి పీఆర్‌సీ ప్రకారం రెండు శాతం పెంచి ఇస్తామనటం అన్యాయ మన్నారు. తెలంగాణలో 2022 పీఆర్‌సీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు బాగా పెంచారని గుర్తుచేశారు. తాము క్రమబద్ధీకరణ కోసం డిమాండ్ చేస్తుంటే కనీసం జీతాలు కూడా పెంచకపోవడం దుర్మార్గమని, యాజమాన్యం పట్టించు కోకపోవడం అన్యాయమన్నారు. భవిష్యత్ కార్యాచరణపై స్ట్రగుల్ కమిటీ చర్చించి...నిర్ణయిస్తుందన్నారు. ప్రస్తుతం తాము ప్రకటించిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగి స్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ రంగ సమస్యలపై మంత్రి సమక్షంలో జరిగిన ఒప్పందాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నా మన్నారు. జేఏసీలో కొంతమంది నాయకులను లొంగ దీసుకుని ప్రభుత్వం చర్చలు జరిపినట్లు ఆరోపించారు. నిరవధిక సమ్మె తేదీపై చర్చించి నిర్ణయం తీసుకుంటా మన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కొంతమందిని లొంగదీసుకొని చర్చలు జరపడం దుర్మార్గమన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, నాయకులు నూర్ అహ్మద్, విద్యుత్ స్ట్రగుల్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించాలి

సీపీఐ డిమాండ్

న్యూఢిల్లీ: పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గులు చేస్తున్న పోరాటానికి భారత కమ్యూనిస్టు పార్టీ మద్దతు తెలిపింది. మాజీ ప్రధాన మంత్రి అటల్ బీహారీ వాజపేయ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వఉద్యోగుల కోసం తీసుకొచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (ఎన్పీఎస్)ని వ్యతిరేకిస్తున్నట్టు సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం ఒక ప్రకటనలో తెలిపింది. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని, ఎన్పీఎస్‌ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగించాలని నిర్ణయించిన పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ జాయింట్ ఫోరం నాయకత్వానికి సీపీఐ అభినందనలు తెలిపింది. భారత రాజ్యాంగం ప్రకారం పెన్షన్ అనేది ప్రభుత్వోద్యోగుల హక్కు అని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో తీర్పునిచ్చిందని స్పష్టం చేసింది. 2003లో వాజ్‌పేయ్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ ఆదేశాల మేరకు పాత పెన్షన్ స్కీమ్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (ఎన్పీఎస్) తీసుకువచ్చారని, వాజ్‌పేయ్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించిన రోజు నుంచి కమ్యూనిస్టు పార్టీ ఎన్పీఎస్‌ని వ్యతిరేకిస్తోందని ఆ ప్రకటనలో సీపీఐ స్పష్టం చేసింది. అనేక బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్పీఎస్‌ని ఉపసంహరిం చుకున్నప్పటికీ, కేంద్రంతో పాటు బీజేపీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో ఎన్పీఎస్‌ను కొనసాగిస్తుండడం విచారకరమని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది.

ఎన్పీఎస్‌పై మోదీ ప్రభుత్వ మొండివైఖరి: అమర్‌జిత్ కౌర్ విమర్శ

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (ఎన్పీఎస్)నికాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (ఎన్పీఎస్)ని కొనసాగించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చాలా మొండిగా వ్యవహరిస్తున్నదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీని అమలులో మెరుగుదల కోసం కంటి తుడుపు చర్యగా మార్గాలను సూచించడానికి ఆర్థిక కార్యదర్శి అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ చెల్లింపు ప్రభుత్వ బాధ్యత, పెన్షన్ వారి హక్కు అని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. హామీలేని ఎన్పీఎస్‌ని రద్దు చేయడంతోపాటు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని చేస్తున్న పోరాటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో ఏఐటీయూసీ భుజం భుజం కలిపి నిలుస్తుందని తెలిపారు. పాత పెన్షన్ పథకం స్థానంలో ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేసిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆమె తెలిపారు. ప్రారంభంలో ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమలు చేయగా, అనంతరం అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎన్పీఎస్‌ని అమలు చేయడం ప్రారంభించాయని తెలిపారు. ఉద్యోగులు వారి వృద్ధాప్య పెన్షన్ కోసం సహకరించమని అడగకూడదు. అందువల్ల ఎన్పీఎస్ మెరుగుదల కోసం కమిటీకి ఇచ్చిన నిబంధన లను తిరస్కరించడానికి, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ కోసం తమ పోరాటాన్ని కొనసాగించడానికి అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, సంస్థలు తీసుకున్న నిర్ణయానికి ఏఐటీయూసీ పూర్తిగా మద్దతుని స్తుందని తెలిపారు. పాత పెన్షన్ స్కీమ్ సాధనకు భవిష్యత్ కార్యాచరణపై జెఎస్ఆర్డీపీఎస్ నిర్ణయం తీసుకోవాలని అమర్‌జిత్ కౌర్ సూచించారు.

టీటీడీ చైర్మన్‌గా భూమన ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా భూమన కరుణాకర్‌రెడ్డి గురువారం ఉదయం శ్రీవారి ఆలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. గరుడాళ్వార్ సన్నిధిలో టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి భూమనతో ప్రమాణ స్వీకారం చేయించారు.వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా వచ్చిన భూమనకు మహాద్వారం వద్ద ఈవో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం భూమన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు రోజా, అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జంగాలపల్లి శ్రీనివాసులు, జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, జేఈవో లు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాన్యులకు సత్వర దర్శనం

టీటీడీ చైర్మన్‌గా సామాన్య భక్తులకు సత్వరం స్వామివారి దర్శనం చేయించడానికే ప్రాధాన్యత ఇస్తానని, ధనవంతుల సేవలో తరించేవాడిని కాదని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం అన్నమయ్య భవ నంలో మీడియాతో మాట్లాడారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దయ, ఆశీస్సులతో ఊహించని విధంగా తనకు రెండవ సారి టీటీడీ చైర్మన్ గా పనిచేసే భాగ్యం దక్కిందన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేలా తమ ధర్మకర్తల మండలి పనిచేస్తుందన్నారు. గతంలో తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేలా ఆచరణలో చేసి చూపామన్నారు. స్వామివారి వైభవాన్ని ప్రజల హృదయాల్లో తీర్చిదిద్దేలా వారిలో ఆధ్యాత్మిక వెలుగులు నింపుతామని చెప్పారు. దేశవిదేశాల్లోని హిందువులందరినీ ఏకతాటిపైకి తెచ్చి హిందూ ధర్మాన్ని ప్రచారం చేసేలా టీటీడీ నాయకత్వం వహిస్తుందని తెలిపారు. తాను స్వామివారి సేవకులకు సేవకునిగా పనిచేస్తానని, అధికారం కోసం కాదని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి డాక్టర్ వై ఎస్ రాజశేఖర రెడ్డి ద్వారా ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇప్పించానని, ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇప్పిస్తామని ఆయన తెలిపారు.

'భారత మాత' అంటేనే తప్పా!

తన ప్రసంగంలోని మాటల తొలగింపుపై రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'భారత మాత' అనే పదాన్ని వినియోగించగా దానిని స్పీకర్ ఓం బిర్లా తొలగించారు. 'అన్‌పార్ల మెంటరీ' (అభ్యంతరకరమైన) మాటలని చెబుతూ రాహుల్ ప్రసంగంలోని కొన్నింటిని రికార్డుల్లో నుంచి తీసేశారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ 'ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే దేశంలో భారత మాత అనడం అభ్యంతకరంగా మారిపోయింది' అని అన్నారు. కాగా, అవిశ్వాస తీర్మానంపై ప్రధాని మోదీ సమాధానానికి ముందే రాహుల్ సభ నుంచి తనకు పనుందని చెప్పి వెళ్లిపోయారు.

సైకోను సాగనంపితేనే భవిష్యత్తు

- ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- రైతులకు ఏడాదికి రూ.20 వేలు
- 'మహాశక్తి' ద్వారా మహిళలకు మేలు
- టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర- సరుబుజ్జిలి/హిరమండలం/ కొత్తూరు: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో హత్య రాజకీ యాలు ఎక్కువయ్యాయని, అవినీతిపై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్నారని టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ నాయకులకు అవగాహన తక్కువ... అహంకారం ఎక్కువని చంద్రబాబు ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్ర మంలో భాగంగా చంద్రబాబు గురువారం వంశధార ప్రాజెక్టును సందర్శించారు. శ్రీకాకుళం జిల్లాకు చేరుకున్న చంద్రబాబు నాయుడును రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షులు కూన రవికుమార్, పాతపట్నం టీడీపీ ఇన్‌చార్జ్ కలమట వెంకటరమణ తదితరులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చంద్రబాబు వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులను పరిశీలించి అక్కడ నుంచి హిరంమండలం చేరుకుని వంశధార మీద నిర్మించిన ప్రాజెక్టును సందర్శించి అక్కడ పనుల వివరాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగిన అనంతరం కొత్తూరు మండలం గూనభద్రలోని ఒక ఫంక్షన్ హాల్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని ప్రాజెక్టులు... టీడీపీ ప్రభుత్వం చేసిన పనులను వివరించారు. గత నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో చేసిన నిర్లక్ష్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... వైసీపీ నాయకులకు అనుభవం లేక అధికార మదంతో కొట్టుకుంటున్నారే తప్ప రాష్ట్ర, ప్రజల శ్రేయస్సు కోసం వారు ఎటువంటి ఆలోచన కూడా చేయడంలేదని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంతం టీడీపీకి కంచుకోట అని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకువచ్చి, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌నరెడ్డి ప్రాజెక్టులను ఎప్పటికి పూర్తి చేయగలరో వారికే అవగాహన లేదని విమర్శించారు. ఎప్పుడూ పోలవరం కోసం ఢిల్లీ వెళుతున్నా అని చెప్పడమే తప్ప చేసిందిగానీ, తెచ్చిందిగానీ లేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార కోసం భూములను త్యాగం చేసిన రైతులకు మరింతగా ఆదుకునే కార్యక్రమం చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం కొత్తూరులో రోడ్‌షో నిర్వహించి నాలురోడ్ల కూడలి వద్ద జరిగిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడారు... రాష్ట్రం లో సైకో పాలన సాగిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని ఇంటికి పంపితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని, ఓటనే ఆయుధం తో ఈ సైకో ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. రాష్ట్రం లో వైసీపీ ప్రభుత్వం అనేక సార్లు విద్యుత్ చార్జీలను పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల పై ఆర్థిక భారం ఎంచిందని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే అవసరం అనుకుంటే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామే గానీ పెంచే ప్రసక్తే లేదన్నారు. రైతులకు ఏటా 20 వేల రూపాయలను పెట్టుబడి సహాయంగా అందించి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. మహాశక్తి , యువత కోసం మండల కేంద్రాల్లో అన్ని వసతులతో కూడిన కేంద్రాలను ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. మహిళా శక్తి పథకం క్రింద ఆర్టీసీ బస్సుల్లో జిల్లాలో ఉచిత ప్రయాణం,18 ఏళ్ల నుండి 59 ఏళ్ల వరకు మహిళలకు నెలకు 15 వందల రూపాయల ఆర్థిక సహాయం, అమ్మకు వందనం కింద ఎందరు పిల్లలు ఉంటే అందరికీ విద్యా సహాయం అందిస్తామన్నారు. ఎన్నికల ముందు మరిన్ని రాయితీ లతో మేనిఫెస్టో ప్రకటిస్తామని తెలిపారు. ముఖ్యంగా యువత... ఈ సైకో పాలనను సాగనంప డానికి ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద నేను ప్రజల కోసం పోరాడుతానని, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రం, ప్రజల అభివృద్ధే నా కర్తవ్యం అని ఆయన తెలిపారు. మూడు గంటల ఆలస్యం అయినా ప్రజలు చంద్రబాబు నాయుడు రాకకోసం నిరీక్షిం చారు. నాలుగు రోడ్లు కూడలిలో సభకు నలు వైపులా డాబాల పై పెద్ద ఎత్తున నిలబడి బాబు ప్రసంగాన్ని విన్నారు. చంద్రబాబు నాయుడు రాక సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి టీడీపీనాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రపంచకప్ జట్టులోకి తిలక్‌వర్మను తీసుకోవాలి: ఎమ్మెస్కే

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ లో తెలుగు తేజం తిలక్ వర్మ అదరగొడుతున్నాడు. అరంగేట్రం సిరీస్‌లోనే అద్భుత బ్యాటింగ్‌తో ఔరా అనిపిస్తున్నాడు. దాంతో... ఈసారి వన్డే ప్రపంచకప్ జట్టుకు అతడిని ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ప్రపంచ కప్ జట్టులో తిలక్ వర్మను తీసుకోవాలని, అతడు జట్టుకు వైవిధ్యాన్ని తీసుకొస్తాడని అన్నాడు. 'టాపార్డర్‌లో ఈ లెఫ్ట్ హ్యాండర్ చక్కగా సరిపోతాడు. చాలా కొద్దిమంది మాత్రమే విభిన్న పరిస్థితులకు అలవాటు పడతారు. వాళ్లలో తిలక్ వర్మ ఒకడు. ఒకవేళ శ్రేయాస్ అయ్యర్ ఫిట్‌గా లేకుంటే అతడి స్థానంలో తిలక్‌ను ఆడించాలి. ఎందుకంటే..? ఈ తెలుగు కుర్రాడు ఫాస్ట్ బౌలర్లతో పాటు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటాడు. అంతేకాదు అవసరాన్ని బట్టి గేర్ మార్చి విరుచుకుపడగల నైపుణ్యం అతడి సొంతం. ఏ రకంగా చూసినా తిలక్ వరల్డ్ కప్‌లో ఆడేందుకు అన్ని విధాలా అర్హుడు' అని ప్రసాద్ వెల్లడించాడు. ఇంతేగాకుండా తిలక్ స్ట్రయిక్ రొటేట్ చేసే విధానం గమినిస్తే తనకు ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు, వన్డేల స్పెషలిస్టు మైఖేల్ బెవాన్ గుర్తుకొస్తున్నాడని ప్రసాద్ అన్నాడు. 'తిలక్ పరిస్థితుల్ని త్వరగా అర్థం చేసుకుంటాడు. చకచకా స్ట్రయిక్ రొటేట్ చేస్తాడు. దాంతో, అతడిని పరుగులు చేయకుండా ఆపడం కష్టం. అతడి ఆట మైఖేల్ బెవాన్‌ను పోలి ఉంటుంది. పైగా దేశవాళీ క్రికెట్‌లో తిలక్ వర్మ సగటు 55 ఉంది. అందుకని అతను వరల్డ్ కప్ జట్టు ఎంపికలో మిగతావాళ్లకంటే బెస్ట్ చాయిస్ అవుతాడు' అని ఎమ్మెస్కె చెప్పు కొచ్చాడు. ఐపీఎల్ 16వ సీజన్‌లో రాణించిన తిలక్ వర్మ జాతీయ జట్టులోకి వచ్చాడు. వెస్టిండీస్‌పై టీ20ల్లో అరంగేట్రం చేసిన ఈ యువ కిశోరం... మొదటి మ్యాచ్‌లో 39, రెండో మ్యాచ్‌లో (51) అర్థ సెంచరీతో మెరిశాడు.

కీలకమైన మూడో మ్యాచ్‌లో 49 నాటౌట్‌తో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. దాంతో, ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ తొలి విజయం నమోదు చేసింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 ఆగస్టు 12న జరగనుంది.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.